నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

29.06.202



# ఆదివారం అనుబంధం

# ఆషాఢం వచ్చింది బోనాల పండుగ తెచ్చింది

సూర్య
www.suryaa.com
29.6.2025
ఆదివారం అనుబంధం

# చైర్మన్‌తో ముఖాముఖి



నూకారపు సూర్య ప్రకాశరావు
చైర్మన్, సూర్య తెలుగుదినపత్రిక

**పంజాబ్ కింగ్స్ – కోల్కతా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్ ఎంత రసవత్తరంగా సాగిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆఖరి వికెట్ వరకూ ఎవరు గెలుస్తారో అన్న ఉత్కంఠ అందరిలోనూ సాగింది. అయితే ఈజీగా గెలవాల్సిన మ్యాచ్ను కోల్కతా నైట్ రైడర్స్ 16 పరుగుల తేడాతో ఓడిపోయింది ఇదెందుకో అర్థం కాలేదు. మీరేమైనా ఈ విషయంపై కామెంట్ చేస్తారా?**

**– నిష్టల వాజేంద్ర కుమార్, హైదరాబాద్**

అవును వాజేంద్ర గారూ... మీరన్నది నిజమే.. . కేకేఆర్ వైపు వీస్తున్న విజయ పవనాలను పంజాబ్ వైపు తిప్పింది మాత్రం యుజ్వేంద్ర చాహలే. చాహల్ బౌలింగ్ మొదలయ్యాక కేకేఆర్ ఏడు పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది.యుజ్వేంద్ర చాహల్ బౌలింగ్ తీసుకునే సమయానికి కోల్కతా నైట్ రైడర్స్ స్కోర్ ఏడు ఓవర్లకు 60/2. ఎనిమిదో ఓవర్లో బౌలింగ్కి వచ్చిన యూజీ చాహల్ నాలుగో బంతికే కెప్టెన్ అజింక్య రహానేను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేశాడు. మళ్లీ పదో ఓవర్లో బౌలింగ్కి వచ్చిన చాహల్ మొదటి బంతిని వైడ్గా వేయగా, రెండో బంతికి సెటిల్ బ్యాటర్ రఘువంశీని అవుట్ చేశాడు.

11వ ఓవర్ బౌలింగ్ చేసిన గ్లెన్ మ్యాక్స్వెల్ వెంకటేశ్ అయ్యర్ను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేశాడు. మళ్లీ 12వ ఓవర్లో బౌలింగ్ చేసిన చాహల్ వెంటవెంటనే రింకూ సింగ్, రమణదీప్ సింగ్ను పెవిలియన్కు పంపాడు. 13వ ఓవర్లో మార్కో యాన్సన్ హర్షిత్ రాణాని క్లీన్ బౌల్డ్ చేశాడు.

కేకేఆర్ ఇన్నింగ్స్ పదో ఓవర్ నుంచి పదమూడో ఓవర్ వరకూ పంజాబ్ బౌలర్లు కేవలం ఏడు పరుగుల వ్యవధిలోనే ఐదు వికెట్లు పడగొట్టారు.

అంగ్క్రిష్ రఘువంశీ, వెంకటేశ్ అయ్యర్, రింకూ సింగ్, రమణదీప్ సింగ్, హర్షిత్ రాణా వెంటవెంటనే పెవిలియన్కు క్యూ కట్టారు. వెంకటేశ్ అయ్యర్ 7, రింకూ సింగ్ 2, రమణదీప్ సింగ్ 0, హర్షిత్ రాణా 3 ఇలా సింగిల్ డిజిట్కే అవుటయ్యారు.ఆఖర్లో ఆండ్రీ రసెల్ పోరాడినప్పటికీ కోల్కతా ఓడిపోలేక తప్పలేదు. 11 బంతులు ఆడిన రసెల్ 1 ఫోర్, రెండు సిక్సర్లతో 17 పరుగులు చేశాడు.

మార్కో యాన్సన్ బౌలింగ్లో షాట్ కొట్టేందుకు ప్రయత్నించి బ్యాట్ ఎడ్జ్కు తీసుకుని బౌల్డ్ అయ్యాడు. కేకేఆర్ బ్యాటర్లలో ఎనిమిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్కే పరిమితమయ్యారు. ఈ మ్యాచ్లో పంజాబ్ కింగ్స్ 15.3 ఓవర్లలో 111 పరుగులకు ఆలౌట్ కాగా.. కేకేఆర్ 95 పరుగులకే ఆలౌట్ అయింది.

పంజాబ్ బౌలర్లలో యుజ్వేంద్ర చాహల్ నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసి 28 పరుగులు ఇచ్చి నాలుగు కీలక వికెట్లు పడగొట్టాడు. మార్కో యాన్సన్ 3.1 ఓవర్లలో 17 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీసుకున్నాడు. అర్షదీప్ సింగ్ మూడు ఓవర్లలో ఒక మేడిన్ వేసి 11 పరుగులే ఇచ్చి ఒక వికెట్ పడగొట్టగా.. జేవియర్ బార్ట్లెట్, గ్లెన్ మ్యాక్స్వెల్ చెరో వికెట్ దక్కించుకున్నారు.

**అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కఠిన వలస విధానాలను అవలంభిస్తున్నారు. అనేక మంది అక్రమ వలసదారులను బలవంతంగా ఇంటికి పంపిస్తూనే.. మరెంతో మంది విద్యార్థి వీసాలను రద్దు చేస్తున్నారు. ఇలా ఓ భారతీయ విద్యార్థి వీసా రద్దు కాగా.. అతడు అక్కడి న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ఈక్రమంలోనే విచారణ చేపట్టిన న్యాయస్థానం ట్రంప్ సర్కారును తప్పు పట్టిందని మీడియా కథనాలు వినిపిస్తున్నాయి. ఇందులో వాస్తవాలు ఎంత? మీకున్న సమాచారం మాకివ్వండి**

**– రావుపల్లి విజయ లక్ష్మి, విజచయవాడ**

అవును విజయలక్ష్మిగారూ... మీరు విన్నది వాస్తవ సమాచారమే భారతీయ విద్యార్థి వీసాను రద్దు కు సంబంధించిన వాజ్యం విజౌచారణకు వచ్చనప్పుడు దానిని చేయకుండా, అతడిని నిర్బంధించకుండా డిపార్ట్మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. .

21 ఏళ్ల వయసు కల్గిన భారతీయ విద్యార్థి క్రిష్‌లాల్ ఐసర్ దాసానీ ప్రస్తుతం అమెరికాలోని విస్కాన్సిన్ మాడిసన్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. అయితే వచ్చే నెలలోనే అతడి గ్రాడ్యుయేషన్ పూర్తి కాబోతుంది. అయితే పూర్తిగా చదువుపైనే ధ్యాస పెట్టిన ఇతడికి.. ఏప్రిల్ 4వ తేదీన ఓ షాకింగ్ విషయం తెలిసింది. ముఖ్యంగా అతడి వీసా రద్దు అయినట్లు గుర్తించాడు. స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్స్ ప్రోగ్రామ్ డేటాబేస్ లో అతడి వివరాలను తొలగించగా.. దాన్ని చూసాడు. దీంతో తీవ్ర ఆందోళన చెందిన క్రిష్‌లాల్ ఐసర్ దాసానీ.. వెంటనే స్థానిక కోర్టును ఆశ్రయించారు.

అక్కడే తన వీసా రద్దుకు సంబంధించిన ఎలాంటి హెచ్చరికలను సర్కారు జారీ చేయలేదని న్యాయస్థానానికి విన్నవించారు. వివరణ ఇచ్చేందుకు కానీ, తప్పు చేసుంటే దాన్ని సరిదిద్దుకోవడానికి కానీ ప్రభుత్వం ఎలాంటి అవకాశం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. మరో నెలలోనే తన చదువు కూడా పూర్తవుతుందని వివరించారు. ఇదంతా విన్న న్యాయస్థానం ట్రంప్ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలా చెప్పాపెట్టకుండా వీసా రద్దు చేయడం సరికాదని తెలిపింది. అలాగే భారతీయ విద్యార్థి క్రిష్‌లాల్ ఐసర్ దాసానీని బహిష్కరించకుండా ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా వీసా రద్దు చేయకుండా, అతడిని నిర్బంధించకుండా డిపార్ట్మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

దీంతో సదరు విద్యార్థి హర్షం వ్యక్తం చేశారు. వీసా రద్దు అయిందని తెలిసిన వెంటనే తన చదువు ఆగిపోతుందని తీవ్రంగా భయపడ్డానని.. కానీ కోర్టు సాయంతో సమస్య తీరిపోయిందని క్రిష్ లాల్ ఐసర్ దాసానీ అక్కడి మీడియాతో మాట్లాడుతూ వివరించారు

## లెజెండ్

# భవిష్యత్ భారత్‌కు పునాది

## ఆర్థిక పునర్నిర్మాణ శిల్పి పీవీ



పాములపర్తి వెంకట నరసింహారావు – భారతీయ రాజకీయ చరిత్రలో మేటి నాయకుడు. దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయిన వేళ దేశాన్ని నిలబెట్టిన దార్శనికుడు. 1991 నుంచి 1996 వరకు భారతదేశ 9వ ప్రధానమంత్రిగా చేసిన సేవలు, ఆర్థిక విధానాల్లో ఆవిష్కరించిన సంస్కరణలు దేశ అభివృద్ధికి మార్గసూత్రంగా నిలిచాయి. “భారత ఆర్థిక సంస్కరణల పితామహుడు” అనే బిరుదును ఆయన సమర్థించుకునేలా చేసుకున్నారు.

పీవీ నరసింహారావు 1921 జూన్ 28న వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో జన్మించారు. ఆయనను భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మ దంపతులు దత్తత తీసుకున్నారు. బాల్యంలోనే మేధస్సు వెలిగించిన ఆయన, నాగ్‌పూర్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం చదివారు. వృత్తిగా న్యాయవాదిగా పాలు పంచుకున్న ఆయన, త్వరలోనే దేశసేవకోసం రాజకీయ రంగంలోకి ప్రవేశించారు.

తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ, తమిళం, మరాఠీ, కన్నడ, అరబిక్, ఫార్సీ, ఫ్రెంచ్, స్పానిష్, లాటిన్ సహా 17 భాషలపై లోతైన పట్టు ఉండటం ఆయన మేధస్సుకి నిదర్శనం. భాషా పరిపక్వత, అధ్యయన నైపుణ్యం, తత్వదృష్టి ఈ మూడు లక్షణాలు ఆయన నాయకత్వాన్ని ప్రత్యేకంగా నిలబెట్టాయి.

ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ్యుడిగా, మంత్రిగా పని చేసిన పీవీ, 1971లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. భూ సంస్కరణలు, విద్యాభివృద్ధి, వెనుకబడిన వర్గాల సంక్షేమం వంటి రంగాల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆపై కేంద్ర రాజకీయాల్లో చురుకుగా పాల్గొని, విదేశాంగ, రక్షణ, హోం, మానవ వనరుల అభివృద్ధి శాఖలను సమర్థవంతంగా నిర్వహించారు.

1991లో రాజీవ్ గాంధీ హత్య అనంతరం కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహించిన పీవీ, దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉంది. విదేశీ మారకద్రవ్య నిల్వలు దారుణంగా తగ్గిపోయి, చెల్లింపుల అసమర్థత దేశాన్ని కుదిపేసింది. ఈ కఠిన సమయంలో, మాన్మోహన్ సింగ్‌ను ఆర్థిక మంత్రిగా నియమించి, సంస్కరణల మార్గాన్ని ఎంచుకున్నారు. లైసెన్స్ రాజ్ తొలగింపు, ప్రైవేటీకరణ ప్రోత్సాహం, ప్రపంచీకరణకు గేట్లు తెరవడం వంటి చర్యలు భారత ఆర్థిక చరిత్రను మలుపుతిప్పాయి.ఆర్థిక విధానాల్లో మాత్రమే కాదు, విదేశాంగంలో కూడా పీవీ తెగువను చూపించారు. “లుక్ ఈస్ట్” విధానాన్ని ప్రవేశపెట్టి ఆగ్నేయాసియాలో భారత్ సంబంధాలను బలోపేతం చేశారు. పంజాబ్, కాశ్మీర్‌లలో ఉగ్రవాదాన్ని కట్టడి చేయడంలో ఆయన ప్రగాఢ చిత్తశుద్ధిని కనబరిచారు. అణు పరీక్షల కోసం భద్రంగా మార్గం వేసి, 1998లో వచ్చిన పోఖ్రాన్- పరీక్షలకు పునాది వేశారు.స్థానిక స్వరాజ్య సంస్థల బలోపేతం కోసం రాజ్యాంగ సవరణలు (73వ, 74వ) అమలు చేసి పంచాయతీరాజ్ వ్యవస్థకు శాశ్వత రూపం ఇచ్చారు. రాజకీయ భావాలు మరియు పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం పెంచే ప్రయత్నాల్లో ఆయన ముందుండారు.అయితే ఆయన పాలనలో బాబ్రీ మసీదు కూల్చివేత, హర్షద్ మెహతా కుంభకోణం వంటి పరిణామాలు తలెత్తినా, ఆ దశలో ఆయన చూపిన సహనం, ధీర్యత విశేషమైనవే. బహుశా ఇతరులైతే బాధ్యతలు వదిలేసేవారేమో, కానీ పీవీ మాత్రం నియమ, ధైర్యంతో ముందుకెళ్లారు.

రచయితగా కూడా పీవీ నరసింహారావు ప్రత్యేకస్థానం సంపాదించారు. “ది ఇన్‌సైడర్” అనే రాజకీయ నవల, “అయోధ్య 93” వంటి రచనలు ఆయనకు విశేష కీర్తిని తెచ్చిపెట్టాయి. భాష, తత్వం, చరిత్రలపై విశ్లేషణాత్మకమైన దృష్టితో రచనలు చేయగలిగిన నాయకుడు అరుదైనదే.

2004 డిసెంబర్ 23న ఆయన మరణించిన తరువాత, ఆయనకు న్యాయమైన గౌరవం లభించలేదన్న విమర్శలు మిగిలిపోయాయి. కానీ, 2020లో తెలంగాణ ప్రభుత్వం ఆయన శతజయంతిని ఘనంగా నిర్వహించి, “పీవీ జ్ఞాన భూమి”గా స్మారక స్థలం నిర్మించింది. కేంద్ర ప్రభుత్వం కూడా 2024లో భారతరత్న ప్రకటించి ఆయన సేవలకు అంగీకారాన్ని ప్రకటించింది.

పీవీ నరసింహారావు... రాజకీయంగా మాటల్లో కన్నా చేతల్లో ఎక్కువ చూపిన నేత. తాత్వికతకు, రాజనీతి కార్యాచరణకు సమన్వయం కలిగిన నాయకుడు. ప్రపంచ వేదికపై భారతదేశాన్ని గౌరవనీయ స్థానానికి చేర్చిన చరిత్రనాయకుడు. ఆయన వేసిన ఆర్థిక, పరిపాలనా, దౌత్య పునాది... భారత భవిష్యత్తుకి నిలయంగా మారింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**9440595494**

సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
ఆదివారం అనుబంధం
29.6.2025

## పాఠకుల లేఖలు




**ముఖచిత్ర కథనం**

ఆదివాసీల ప్రాభవాన్ని తెలిపేలా అపురూప మ్యూజియం ఏర్పాట్ల ఆవశ్యకతపై ఆదివారం అనుబంధంలో ప్రచురించిన వ్యాసం చాలా బాఉంది. వివరణలతో కూడిన వ్యాసం ప్రచురించి తెలియని ఎన్నో విషయాలు తెలిపారు. రచయితకు, సంపాదక వర్గానికి, యాజమాన్యానికి ధన్యవాదాలు. సందర్భానుసారంగా మీ కథనాలు బాగున్నాయి. ఇదే పంథా కొనసాగించండి.

**– ఎలకల రవికుమార్, విశాఖపట్నం, – లింగమనేని రాజేష్, అనపర్తి,**
**–వాడపల్లి గణేష్ కుమార్ హైదరాబాద్**

**సినిమా రివ్యూలు**

వారం వారం విడుదలవుతున్న సినిమాలపై మీ విశ్లేషణ బాగుంది. ధన్యవాదాలు. ఓటిటి సినిమాలపై కూడా విశ్లేషణ చేయటం హర్షణీయం.

**–చినవీరభద్రుడు కణపాక, హైదరాబాద్**

**బుడత బాగున్నాడు**

చిన్నారి ప్రపంచంలా ప్రచురిత మవుతున్న బుడత పేజీలో చిన్నారులకు వుపయుక్తంగా రచయి తలు రాస్తున్న కథలు బాగున్నాయి. అలాగే పజిల్స్ విజ్ఞాన వంతంగా ఉన్నాయి. తెలుగువారి శతకాలు, పద్యాలు అప్పుడప్పుడు మిస్ అవుతున్నాం. తప్పక ప్రచురించండి

**ముక్కామల పద్మావతి, హైదరాబాద్**
**వేదవతీ ప్రభాకర్, విజయవాడ**
**రాజేశ్వరీ నాయర్, వరంగల్**

**ఘుమఘుమల కాలమ్ పునరుద్ధరించండి**

మాకు ఎంతో ఇష్టమైన వంటలు, చిరుతుళ్ల తయారీకి సంబంధించిన ఘుమఘుమలు కాలమ్ కొన్నాళ్లుగా ఆపేసారు దానిని పునరుద్ధరించండి. నాలాంటి జింహ్వాచాపల్యులకే కాదు, వంటలు చేసే మహిళా మణులు కూడా ఇంటిలో కొత్త రుచులు అందించే అవకాశం ఉంటుంది.

**– చిత్రంగి ముళ్లపూడి, వాటపాలేం, విశాఖ**


## నవకవిత్వం


# జగన్నాథ రథోత్సవం


విశ్వానికే జగన్నాథ ప్రభువు..
జగన్నాథ రూపమే శ్రీ కృష్ణుడు
జగన్నాథుడే బయలుదేరి%ౌ
%పూరీ విధుల్లో ఊరేగుతూ..
భక్తకోటి చెంతకు చేరి..
దర్శనమిచ్చి పునీతుల్ని చేసేదే..
జగన్నాథ రథ లీల మహోత్సవం !
గరుడ ధ్వజ రథంలో జగన్నాథుడు
తాళ ధ్వజ రథంలో బలరాముడు
పద్మ ధ్వజ వాహనంలో సుభద్ర%ౌ
%భవ్య తోబుట్టువుల త్రయం..
ములవిరాట్టులే రథాల్లో..
కొలువుతీరి పూరీ వీధుల్లో..
అశేష భక్తులకు దర్శనమిస్తూ..
దివ్య ఆశీర్వాదాలు వర్షిస్తూ..
పుట్టిల్లు గుడించా మందిరానికి..
చేరుకొని విశ్రాంతి తీసుకొని..
బహుదా తిరుగు యాత్రలో..
ప్రధాన ఆలయానికి చేరిన వేళ..
ఛప్పన్ భోగ్ నైవేద్యాలు స్వీకరించి..
భక్తులకు ప్రసాదాలను పంచే..
పరమ పవిత్ర రథ ప్రయాణం
జగన్నాథుడి ఉజ్వల రథోత్సవం !
దేహమే ఓ దివ్య రథం..
జీవుడే రథ సారథి..
ఆత్మయే రథికుడు..
మూడంచెల రథం..
పరమపద సంకేతం
ఆపత్తు నుంచి శ్రేయ-
స్సుకు..
నిశీధి నుంచి వెలుతు-
రుకు..
మృత్యువు నుంచి
అమృతత్వానికి%ౌ
%వం నో ర ధా న్ని
జగన్నాథుడికి..
నివేదించడమే రథయాత్ర అర్థం !



**మధుపాళీ**
**9949700037**




ఫన్‌చ్
నారు

సూర్య
www.suryaa.com
29.6.2025
ఆదివారం అనుబంధం

# బుడత


## బాలల కథ



### పట్టువదలని విక్రమార్కుడు


చెట్టు వద్దకు తిరిగి వెళ్లి, చెట్టుపైనుంచి శవాన్ని దించి భుజాన వేసుకుని, ఎప్పటిలాగే మౌనంగా శ్మశానం కేసి నడవ సాగాడు. అప్పుడు శవంలోని బేతాళుడు, "రాజా, అర్ధరాత్రి వేళ, భీతగొలిపే ఈ స్మశానంలో, తల పెట్టిన కార్యం సాధించేందుకు, దృఢ సంకల్పంతో నువ్వు చేస్తున్న ధైర్య సాహసాలు మేచ్చుదగినవే. అయితే వాటితో పాటు మనిషికి లోకజ్ఞత, సమయస్ఫూర్తి, లక్ష్య శుద్ధి ఎంతో అవసరం. అవి లేనివాడు కార్యం సిద్ధించే తరుణంలో దాన్ని చేజేతులా జారవిడవడం జరుగుతుంది. ఇందుకు ఉదాహరణంగా సునందుడనే వాడి కథ చెబుతాను, శ్రమ తెలియకుండా విను" అంటూ ఇలా చెప్ప సాగాడు:పూర్వం విరూపదేశానికి బృహస్పతి లాంటి బుద్ధిశాలి అయిన మంత్రి వుండే వాడు. మహారాజు శూరసేనుడు ప్రతి విషయానికి మంత్రి మీదనే ఆధార పడేవాడు. ఆయన పాలనలో దేశం సుభిక్షంగా వుంది. దురదృష్టవశాత్తు మహామంత్రి అకాల మరణానికి గురయ్యాడు. శూరసేనుడు కొత్త మంత్రిని ఎన్నుకుని, ఆయన సలహాలతో రాజ్య పాలన చేయ సాగాడు.కొత్త మంత్రికి రాజును మెప్పించడం బాగా తెలుసు కానీ, సలహాలివ్వడం బొత్తిగా చేత కాదు. అయినా తనకు తోచిన సలహాలిస్తూంటే రాజ్యపాలన అస్తవ్యస్తంగా సాగింది. కొందరు రాజుకీ విషయం చెబితే ఆయన అంగీకరించి, "మంత్రి సలహా తోనే రాజ్యం సుభీక్షంగా వుంది. మంత్రి అన్నవాడు తప్పుడు సలహాలివ్వలేదు. రాజ్యంలో ఇబ్బందులు వస్తే అవి తాత్కాలికం," అన్నాడు. చివరకు రాజగురువు కూడా శూరసేనుడిని, మంత్రి సలహాల గురించి హెచ్చరించాడు. రాజు నవ్వి, "గురువర్యా! తమకు దేవకార్యాల గురించి తెలిసినట్లు రాజకార్యాల గురించి తెలియదు. పాత మంత్రి సలహాలను కూడా ఆరంభంలో కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారు. కొత్త మంత్రి సలహాల గొప్పతనం, కొద్ది కాలంలోనే అందరూ అర్థం చేసుకుంటారు" అన్నాడు. అందుకు రాజగురువు ఏమి అనలేక పాత మంత్రి ఇంటికి వెళ్ళాడు. పాత మంత్రి భార్య ఆయనకు నమస్కరించి ఉచితాసనం చూపించింది. రాజ గురువు ఆమెను ఆశీర్వదించి, "అమ్మాయి! మహారాజు శూరసేనుడు, నీ భర్త వల్ల బాగా ప్రభావితుడైనాడు. కానీ నీ భర్త మంత్రి స్థానాన్ని ఇప్పుడొక మూరు□డు ఆక్రమించాడు. వాడు తన తప్పుడు సలహాలతో దేశానికి హాని కలిగిస్తున్నాడు. మెచ్చుకోలు కబుర్లతో రాజుని మెప్పించి, తన స్థానం పటిష్ఠం చేసుకున్నాడు. కేవలం మంత్రి సలహాలపైనే ఆధార పడడం, ఏ రాజుకూ మంచిదికాదని శూరసేనుడు గ్రహించలేకపోతున్నాడు. ప్రస్తుతానికి మనం చేయగలిగిందేమీ లేదు. కాని నువ్వు దేశానికొక ఉపకారం చేయాలి. నీ కుమారుడు సునందుడికిప్పుడు పదేళ్ళ వయసు గదా! చండకారణ్యం లోని వితండుడి గురుకులాశ్రమానికి వాణ్ని పంపు. వితండుడు నీ కుమారుడిని విచక్షణ జ్ఞానం గల మహా మంత్రిగా తీర్చి దిద్దుతాడు. నీ కుమారుడు విద్య ముగించుకుని తిరిగి వచ్చేవరకూ, మన దేశానికి మోక్షం లేదు," అన్నాడు.పాత మంత్రి భార్య అందుకు సరేనని అలాగే చేసింది. పదేళ్ళ వయసులో సునందుడు, తల్లిని విడిచి చండకారణ్యం చేరుకున్నాడు.అక్కడ వితండుడు, వాణ్ణి చూసి విషయమడిగి తెలుసుకుని, "గురుకులానికి జ్ఞాన సముపార్జన కోసం రావాలి. మంత్రి పదవిని ఆశించి రాకూడదు. అయినా నీకింకా పదవి గురించి ఆలోచించే వయసు రాలేదు." అన్నాడు.సునందుడు వితండుడికి నమస్కరించి, "గురువర్యా! నా తండ్రి మంచి సలహాలతో మహారాజుకు సాయ పడిన మాట నిజం. ఆ విధంగా దేశానికి ఉపకారం జరిగింది. కానీ నా తండ్రి కారణంగా రాజుకు మంత్రి సలహాలన్నీ మంచి సలహాలేనన్న దురభిప్రాయం కలిగింది. అది తొలగించాల్సిన భాద్యత నాది. సమర్థుడైన మంత్రి, రాజులో విచక్షణా జ్ఞానాన్ని పెంచుతాడు తప్ప, అన్నింటికీ తనపై ఆధారపడేలా చేయడు. నా తండ్రి చేసిన తప్పును సవరించడం కోసమే నేను తమ వద్దకు వచ్చాను." అన్నాడు.వితండుడు, సునందుణి దీవించి, "నీలో గొప్ప తెజస్సుంది. నీ మాటలు వయసుకు మించిన తెలివిని సూచిస్తున్నాయి. నిన్ను సకల శాస్త్ర పారంగాతుడిని చేసి, నా తర్వాత ఈ గురుకులాన్ని నీకి అప్పగించాలనిపిస్తోంది. అయితే, నీ అభిప్రాయం కూడా న్యాయమైనదే! కానీ ఒక్క విషయం గుర్తుంచుకో! కేవలం ఉద్యోగం, పదవిని ఆశించి చదివేవాడు, జీవితంలో ఎందుకూ కొరగాకుండా పోతాడు." అన్నాడు.సునందుడు వినయంగా తలవంచి ఊరుకుని, ఆ రోజే విద్యాభ్యాసం ప్రారంభించాడు. వితండుడు వాడికి అన్నీ నేర్పుతూనే రాజరికం, మత్రంగాల గురించి కూడా వివరిస్తుండేవాడు. ఆ విధంగా మూడు సంవత్సరాలు గడిచేసరికి, వాడు తనకంటేముందు చేరినవారిని కూడా అధిగమించి గురుకులంలో ప్రథముడుగా నిలిచాడు.ఒక రోజు వితండుడు శిష్యులు అందర్నీ సమావేశ పరించి, "మీ లో రమాకాంతుడు ఎందుకూ కోరగానివాడని గుర్తించాను. ఇన్నేళ్ళ నా శిక్షణ వాడి విషయంలో వృధా అయిందని నాకెంతో బాధగా వుంది. మీలో ఎవరైనా వాడి బాధ్యతను స్వీకరించి, వాడి మెదడులో రవ్వంత జ్ఞానాన్ని ప్రవేశించ పెట్టినా, నాకు సంతోషం. అలా చేసినవాడికి నా తదనంతరం గురుకులం అప్ప జెబుతాను." అన్నాడు.ఇది వింటూనే రమాకాంతుడు కోపంగా లేచి, "నా సాటి వారిచేత పాఠాలు చెప్పించుకునేందుకు నేనిక్కడికి రాలేదు. నలుగురి ముందూ నా గురువే నన్నిలా అవమానించాక, నాకిక్కడ పనేముంది?" అని వెళ్ళిపోయాడు.అప్పుడు వితండుడు నిట్టూర్చి, "రమాకాంతుడికి మంత్రి కావాలన్న కొరిక బలంగా వుంది. అందువల్ల ఏ విద్య అబ్బలేదు." అన్నాడు.మరొక రెండు సంవత్సరాలకు సునందుడి విద్యాభ్యాసం పూర్తయ్యింది. వాడు వితండుడిని గురుదక్షిణగా ఏమి కావాలని అడిగాడు."నువ్వు నా గురుకులాన్ని నడుపుతానంటే అదే నాకు గురుదక్షిణ!" అన్నాడు వితండుడు.గురువర్యా! గురువుకంటే ప్రథమ స్థానం తల్లిదని సర్వ శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. మాతృదక్షిణను కాదని గురుదక్షిణ ఇమ్మని తమరాదేసిస్తే, అలాగే చేస్తాను!" అన్నాడు సునందుడు."పదిహేనేళ్ళ వయసుకే ఇంతవాడివయ్యావు. నీ జ్ఞానం ఒక రాజ భావనానికీ, నీ తెలివి ఒక రాజుకు పరిమితం కావడం ఇష్టం లేక అలా అన్నాను. నీ మనసుకు తోచిన పని ఏది చేస్తే, అదే నా గురు దక్షిణ. వెళ్లిరా నాయనా!" అన్నాడు.సునందుడు విరూపదేశారిగ వెళ్ళాడు. సూరసేనుడు ఇప్పుడు రాజ్యమేలడం లేదని, ఆయన అనారోగ్యంతో మంచం పట్టడం వల్ల మూడు సంవత్సరాల నించి ఆయన కుమారుడు వీరసేనుడు రాజ్యమేలుతున్నాడని తెలుసుకున్నాడు.వీరసేనుడు గొప్ప అహంకారి. అన్నీ తనకే తెలుసనుకుంటాడు. తనకు సలహాలివ్వడానికి కాక, తను చెప్పింది అవుననడానికి మంత్రి కావాలి అతడికి! తన తండ్రి సూరసేనుడిని మెప్పించిన మంత్రి అనర్హుడని అంతా అనడం వల్ల, కొత్త మంత్రి కోసం ప్రకటన చేశాడు.సునందుడు ఇల్లు చేరగానే తల్లి ఈ విషయాలన్నీ చెప్పి, "నువ్వు సరైన సమయానికి వచ్చావు. రేపే వీరసేనుడు కొత్త మంత్రిని ఎన్నుకోబోతున్నాడు. నువ్వాయనకు మంత్రివై, తండ్రిని మించిన తనయుడనిపించుకోవాలి." అన్నది.దురదృష్టం కొద్ది ఆ రాత్రే సునందుడికి వొళ్ళు తెలియని జ్వరం వచ్చింది. అప్పుడు రాజగురువు వచ్చి వాణ్ణి కలుసుకుని, "నాయనా! కొత్త మంత్రి ఎన్నిక అయిపోయింది. నీవు వచ్చినట్లు నాకు ఆలస్యంగా తెలిసింది. ఇప్పటికైనా సమయం మించిపోలేదు. నాతొ వస్తే రాజుకు నిన్ను పరిచయం చేస్తాను. నేను చెబితే ఇద్దరు మంత్రులను తీసుకునేందుకు రాజు వెనకాడడు.

(మిగతా కథ వచ్చేవారం)



## Spot the Differences

Find the 5 differences between these 2 pictures.



నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
29.6.2025

# ఎంబిబిఎస్ ప్రోగ్రామ్లలో ప్రవేశం కోసం నీట్ ప్రవేశ పరీక్ష

ప్రతి సంవత్సరం, భారతదేశం అంతటా ఎంబిబిఎస్ ప్రోగ్రామ్లలో ప్రవేశం కోసం 20 లక్షలకు పైగా విద్యార్థులు నీట్ ప్రవేశ పరీక్షకు హాజరవుతారు. ఈ అభ్యర్థులలో దాదాపు 55%-%60% మంది అర్హత సాధించినప్పటికీ, ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థలలో, అలాగే బిడిఎస్‌లో ఉన్న మొత్తం వైద్య సీట్ల సంఖ్య కేవలం 1.36 లక్షలు మాత్రమే. పర్యవసానంగా, దాదాపు 10 లక్షల మంది అర్హత కలిగిన అభ్యర్థులు వైద్య సీటు పొందలేకపోతున్నారు మరియు ప్రత్యామ్నాయ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను అభ్యసించవలసి వస్తుంది. ఈ సమూహంలో, దాదాపు 10% మంది రష్యా, జార్జియా, కజకిస్తాన్, కిర్గిజ్స్తాన్, చైనా, ఫిలిప్పీన్స్, వియత్నాం, ఉజ్బెకిస్తాన్, అజర్బైజాన్ మరియు ఇతర దేశాలలో విదేశాలలో ఎంబిబిఎస్ చదవడానికి ఎంచుకుంటారు. భారతదేశంలో వైద్య విద్యను నియంత్రించే అత్యున్నత సంస్థ అయిన నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎమ్‌సి) ప్రకారం, విదేశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేసిన విద్యార్థులు భారతదేశంలో మెడిసిన్ ప్రాక్టీస్ చేయడానికి మరియు %ూ+% డిగ్రీని అభ్యసించడానికి అర్హత పొందాలంటే ఎఫ్ఎమ్‌జిఇ/ తదుపరి పరీక్షలో అర్హత సాధించాలి. అంతేకాకుండా, ఎన్ఎమ్‌సి మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్న విదేశీ ప్రోగ్రామ్లు మాత్రమే గుర్తించబడతాయి.

అయితే, గణాంకాల ప్రకారం విదేశాల్లో చదువుకునే విద్యార్థులలో 6%%-%20% మంది మాత్రమే ఎఫ్ఎమ్‌జిఇ/ తదుపరి పరీక్షలో విజయవంతంగా ఉత్తీర్ణులవుతున్నారు, దీనివల్ల గణనీయమైన 80%%-%90% మంది సమయం మరియు డబ్బు పెట్టుబడి పెట్టినా ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నారు. బోధనా




పద్ధతుల్లో తేడాలు, భాషా అడ్డంకులు, విదేశీ సంస్థలలో తగినంత ఆచరణాత్మక శిక్షణ లేకపోవడం మరియు తదుపరి పరీక్షకు తగినంత తయారీ లేకపోవడం వల్ల తక్కువ విజయ రేటు ప్రధానంగా కారణమని చెప్పవచ్చు.

విదేశాలలో నాణ్యమైన వైద్య విద్య కోసం వ్యూహాత్మక భాగస్వామ్యం: విదేశాలలో ఎంబిబిఎస్ చదువుతున్న భారతీయ విద్యార్థుల విద్యా ఫలితాలను మెరుగుపరచడానికి మరియు ఈ అంతరాన్ని తగ్గించడానికి, అపోలో హాస్పిటల్స్ గ్రూప్ యొక్క విభాగం అయిన అపోలో మెడ్స్కిల్స్ లిమిటెడ్, భారతదేశం - ప్రస్తుత విద్యా సంవత్సరం 2025-26 నుండి ఉజ్బెకిస్తాన్లోని జార్మెడ్ విశ్వవిద్యాలయంతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ సహకారం ద్వారా, అపోలో మెడ్స్కిల్స్ ఉజ్బెకిస్తాన్లోని సమర్కండ్ మరియు బుఖారాలోని జార్మెడ్ విశ్వవిద్యాలయం క్యాంపస్లలో "జాప్ ఎంబిబిఎస్ ప్రోగ్రామ్" ద్వారా ప్రత్యేకంగా చేరిన భారతీయ విద్యార్థులకు ఇంగ్లీష్ మాధ్యమంలో ఎంబిబిఎస్ కోర్సులను బోధించడానికి అనుభవజ్ఞులైన భారతీయ బోధనా అధ్యాపకులను అందిస్తుంది.

జర్మెడ్ విశ్వవిద్యాలయం ఉజ్బెకిస్తాన్లోని ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ సంస్థ, ఇది అత్యాధునిక మౌలిక సదుపాయాలను అందిస్తుంది. ఈ చొరవ ఒక ప్రసిద్ధ భారతీయ వైద్య విద్య మరియు నైపుణ్యాల అభివృద్ధి సంస్థ మరియు భారతీయ విద్యార్థులకు భారతీయ వైద్య కళాశాలలతో సమానంగా అభ్యాస అనుభవాన్ని అందించడానికి రూపొందించబడిన విదేశీ విశ్వవిద్యాలయం మధ్య మొట్టమొదటి భాగస్వామ్యాన్ని సూచిస్తుంది.

2012లో స్థాపించబడిన అపోలో మెడ్స్కిల్స్ లిమిటెడ్, భారతదేశంలో వైద్య నైపుణ్య అభివృద్ధిలో ప్రముఖ శక్తిగా ఉంది. ఎన్ఎస్‌డిసి (నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) మరియు వివిధ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ సంస్థల సహకారంతో, ఇది 25 రాష్ట్రాలలో 45 శిక్షణా కేంద్రాలను నిర్వహిస్తోంది మరియు ఆరోగ్య సంరక్షణ రంగంలో రాణించినందుకు బహుళ అవార్డులను అందుకుంది.

డాక్టర్ శ్రీనివాస రావు పులిజల, సిఇఓ
08064534088

# వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ లో  రాహుల్ అత్తులూరి

హైదరాబాద్,  : టెక్ విద్యా రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న నెక్స్ట్ వేవ్ మరియు ఎన్ఐఏటి సహ-వ్యవస్థాపకుడు, సీఈఓ రాహుల్ అత్తులూరికి అరుదైన గౌరవం లభించింది. చైనా లోని టియాన్జిన్ లో జరిగిన 'ఆన్యువల్ మీటింగ్ ఆఫ్ ది న్యూ చాంపియన్స్'కి రాహుల్ ని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఆహ్వానించింది. ఈ మీటింగ్ ని సమ్మర్ దావోస్ అని కూడా అంటారు. అధునాతన టెక్నాలిజీలతో వేగంగా మారిపోతున్న జాబ్ మార్కెట్‌లో, ముఖ్యంగా ఏజెంటిక్ ఏఐ వల్ల ఎంట్రీ-లెవల్ ఉద్యోగాలపై పడుతున్న ప్రభావం గురించి, యువతకు కొత్త అవకాశాలు ఎలా సృష్టించాలనే విషయంపై ఆయన ప్రసంగించారు.హో

తెలంగాణలోని రామగుండానికి చెందిన రాహుల్ అత్తులూరి, ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ లో చదివారు. ఇప్పుడు దేశ విద్యా రంగాన్ని టెక్నాలజీతో మెరుగుపరుస్తున్న ప్రముఖ నాయకులలో ఒకరిగా ఎదిగారు. ఎంతో మంది తెలుగు రాష్ట్రాల యువతకు ప్రేరణగా నిలిచారు.

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (%ఔజుఖీ%) అనే సంస్థ స్విట్జర్లాండ్‌లోని కోలోగ్నీ వేదికగా ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రపంచాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా కృషి చేస్తుంది. ఈ వేదికలో జరిగే వార్షిక సమావేశానికి ప్రపంచ నేతలు, ప్రముఖ కంపెనీల సీఈఓలు, పాలసీ రూపకర్తలు, పరిశోధకులు హాజరవుతారు. ప్రపంచ, ప్రాంతీయ, పరిశ్రమల అజెండాలపై చర్చలు జరుగుతాయి. మన దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ, బిల్ గేట్స్, డోనాల్డ్ ట్రంప్, సత్య నాదెళ్ల, సుందర్ పిచై, ఎలాన్ మస్క్ లాంటి అగ్ర నాయకులు గతంలో ఈ వేదికపై ప్రసంగించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ కార్యక్రమాలలో వివిధ ప్రభుత్వాల మంత్రులు, ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల %జశూ%లు కూడా పాల్గొంటుంటారు.

"కెరీర్ పాత్వేస్ రీవైర్డ్" సెషన్‌లో రాహుల్ అత్తులూరి మాట్లాడుతూ, "భారతదేశ జనాభాలో 60 శాతం మంది యువతే. ఇది రెండు వైపులా పదును ఉన్న ఖడ్గం లాంటిది. వీరి ప్రతిభను చక్కటి మార్గంలో మలిచితే, ఇది ఒక పెద్ద వరం. లేదా అవకాశాన్ని వదిలేసినట్లైతే ఒక పెద్ద భారంగా మారుతుంది," అని రాహుల్ పేర్కొన్నారు.

"టెక్నాలజీ మార్పుల ప్రభావం ఎప్పుడూ జే అక్షర రూపం లో ఉండే



కర్వ్ లాగా ఉంటుంది. ప్రస్తుతం ఉద్యోగాలు కోల్పోతున్న దశలో ఉన్నాం. చాలా కంపెనీలు హైరింగ్‌ను ఆపేసాయి. కస్టమర్ సపోర్ట్ వంటి ఎంట్రీ లెవెల్ ఉద్యోగాలు తగ్గిపోతున్నాయి, ఏఐతో పనులు వేగంగా చేసుకుంటున్నాయి," అని రాహుల్ అన్నారు.హో

అయితే ఇవన్నీ తాత్కాలికంగా జరిగే మార్పులేనని రాహుల్ స్పష్టం చేస్తూ, "మూడు నుంచి ఐదు సంవత్సరాల్లో ఏఐ స్కిల్స్ ఉన్న వారి కోసం ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతుంది. జనరేటివ్ ఏఐ వల్ల భారీ స్థాయిలో అవకాశాలు వస్తాయి. దానికి భారత్ సిద్ధంగా ఉండాలి. ఏజెంటిక్ ఏఐ వల్ల ఎంట్రీ లెవెల్ పనులు వేగంగా ఆటోమేట్ అవుతున్నాయి. దీని ఫలితంగా, సంప్రదాయ ఉద్యోగ మార్గాలు మారిపోతున్నాయి. ఇలాంటి సమయంలో పరిశ్రమలు, విద్యా సంస్థలు కలసి పని చేయడం చాలా కీలకం. డిగ్రీలతో పాటు స్కిల్స్‌కి కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. స్కిల్ క్రెడెన్షియల్స్‌పై మరింత దృష్టి పెట్టాలి" అని అన్నారు.హో

అలాగే, విద్యలో ఏఐ పాత్ర గురించి మాట్లాడుతూ, "విద్యార్థులు ఏఐని ఏఐ సహాయంతోనే నేర్చుకోవాలి. కంపెనీలు తమకు కావలసిన నైపుణ్యాలను స్పష్టంగా వెల్లడించాలి. ఇలా చెయ్యడంతో విద్యార్థులు రాబోయే ఉద్యోగ అవసరాలకు అనుగుణంగా తయారవుతారు" అని అన్నారు.

భారత ప్రభుత్వం మరియు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కలిసి, యువతకు ఏఐ యుగానికి అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు విస్తృతమైన చర్యలు చేపడుతున్నట్లు రాహుల్ అత్తులూరి వివరించారు. అలానే యువత కేవలం ఏఐ స్కిల్స్ మాత్రమే కాదు, మానవతా విలువలతో కూడిన నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా నేర్చుకోవడం అవసరం అన్నారు. అలాగే, ఏఐ లో ప్రావీణ్యం సాధించి పరిశ్రమలో విలువైన వ్యక్తులుగా ఎదగాలి అని వివరించారు.

"ప్రస్తుతం ఉన్న డిజిటల్ డివైడ్ ను నివారించాలంటే, విద్యలో ప్రారంభ దశ నుంచే విద్యార్థులకు ఏఐ టూల్స్ అందుబాటులో ఉండాలి. ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అందరికీ చేరువలో ఉండాలి. ప్రత్యేకంగా, నో-కోడ్ లేదా లో-కోడ్ టూల్స్‌తో విద్యార్థులు కొత్త ప్రాజెక్టులు బిల్డ్ చెయ్యాలి, ఏఐ ఏజెంట్లను ఉపయోగించాలి. ఇలా నేర్చుకోవడం వల్ల ఇండస్ట్రీలోకి ప్రవేశించే సమయానికి చక్కటి స్కిల్స్ తో సిద్ధంగా ఉంటారు," అని రాహుల్ అత్తులూరి అన్నారు.

2024లో నెక్స్ట్ వేవ్ ను వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్  టెక్నాలజీ పయనీర్ గా గుర్తించింది. ఈ గౌరవం ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేవలం 100 సంస్థలకు మాత్రమే దక్కుతుంది. గతంలో గూగుల్, స్పోటిఫై, ఎయిర్ బీఎన్‌బీ, ట్విట్టర్ (ఇప్పుడు ఎక్స్) లాంటి సంస్థలు ఇదే గుర్తింపు పొందాయి. తర్వాత అవన్నీ ప్రపంచాన్ని మార్చిన టెక్ కంపెనీలుగా నిలిచాయి.హో

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సమ్మర్ దావోస్ లో రాహుల్ అత్తులూరి పాల్గొనడం నెక్స్ట్ వేవ్ కి కీలక మైలురాయిగా నిలిచింది.

ప్రపంచవ్యాప్తంగా ఈ సంస్థ గుర్తింపు పొందుతోంది. ఏఐ ఆధారితంగా, స్థానిక భాషల్లో నేర్చుకునేలా రూపొందించిన నెక్స్ట్ వేవ్ లెర్నింగ్ ప్లాట్ఫారం యొక్క వినూత్న విధానం అంతర్జాతీయంగా

సూర్య
www.suryaa.com
29.6.2025

# బోనాలు స్పెషల్.. రెసిపీ



**బోనాలు స్పెషల్.. అమ్మవారికి ఇష్టమైన మక్క గారెలు రెసిపీ, కాస్త వెరైటీగా మరింత రుచితో**

**బోనాల సమయంలో అమ్మవారికి ఇష్టమైన వంటలు చేయడంతో పాటు.. రుచిగా ఏదైనా తినాలనుకుంటే మక్కగారెలు ట్రై చేయవచ్చు. అయితే ఈ రెసిపీ కాస్త వెరైటీ.**

## మక్క గారెలు



మరికొన్ని రోజుల్లో బోనాలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ సంవత్సరం జూన్ 26 నుంచి ఆషాఢ బోనాలు ప్రారంభం కానున్నాయి. పండుగ సమయంలో అమ్మవారికి ఇష్టమైన బోనాలు సిద్ధం చేయడంతో పాటు ఎన్నో రకాల వంటలు నైవేద్యంగా పెడతారు. వాటిలో అమ్మవారికి ఇష్టమైన మక్క గారెలు కూడా ఉంటాయి. అయితే ఈసారి కాస్త వెరైటీగా, మరింత రుచిగా ఈ మక్కగారెలు చేయాలనుకుంటే ఈ టేస్ట్ రెసిపీని ఫాలో అయిపోవాలి. ఈ రెసిపీ కోసం కావాల్సిన పదార్థాలు ఏంటి? వాటిని ఎలా తయారు చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

కావాల్సిన పదార్థాలు
స్వీట్ కార్న్ – 2
మినపప్పు – 1 కప్పు
ఉప్మా రవ్వ – అరకప్పు
పచ్చిమిర్చి – 3
నూనె – డీప్ ఫ్రైకి సరిపడా



అల్లం – ఒక అంగుళం
ఉప్పు – రుచికి తగినంత
వంట సోడా – 1 టీస్పూన్
కొత్తిమీర తురుము – అరకప్పు

తయారీ విధానం

ముందుగా మినపప్పును ముందు రోజు రాత్రి నానబెట్టుకోవాలి. లేదంటే మూడు గంటల ముందు నానబెట్టుకోవాలి. మినపప్పు నానిన తర్వాత దానిని మిక్సీలో వేసుకోవాలి. గారెల కోసం నీటిని వేయకుండా పిండిని మిక్సీ చేసుకోవాలి. తప్పదు అనుకుంటే కాస్త నీటిని చిలకరించాలి. కానీ పిండి మాత్రం గట్టిగానే ఉండేలా సిద్ధం చేసుకోవాలి. ఈ పిండిని పక్కన పెట్టి స్వీట్ కార్న్ మిక్సీలో వేసి మెత్తగా పేస్ట్ చేసుకోవాలి. దానిని కూడా ఓ గిన్నెలోకి తీసుకోవాలి.

మిక్సింగ్ బౌల్ తీసుకుని దానిలో మినపపిండి, స్వీట్ కార్న్ పేస్ట్ వేసుకోవాలి. స్వీట్ కార్న్ కాస్త నీటిని వదులుతుంది కాబట్టి దానిలో ఉప్మారవ్వ వేసుకోవాలి. లేదు అనుకుంటే బియ్యం పిండిని కూడా వేసుకోవచ్చు. పిండి వదులుని బట్టి ఉప్మారవ్వ లేదా బియ్యం పిండ వేసుకోవాల్సి ఉంటుంది.

ఇప్పుడు దానిలో ముందుగా తురిమిన పచ్చిమిర్చి, అల్లం ముక్కలు వేయాలి. కొత్తిమీర తురుము, ఉప్పు, వంటసోడా వేసుకోవాలి.

మిశ్రమాలు అన్ని బాగా కలిసేలా పిండిని కలిపి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టౌవ్ వెలిగించి దానిపై కడాయి పెట్టుకోవాలి.

దానిలో డీప్ ఫ్రైకి సరిపడా ఆయిల్ పోసుకోవాలి. నూనె కాగే వరకు పిండిని అలా పక్కన వదిలేయాలి. నూనె వేడి అయిన తర్వాత స్టౌవ్ని మీడియంలోకి పెట్టి పిండిని తీసుకుని గారెలుగా చేసుకోవాలి. వాటిని నూనెలో వేసి వేయించుకోవాలి.

గారెలు రెండూ వైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చేవరకు వేయించుకోవాలి. ఇలా మొత్తం పిండితో గారెలు చేసుకోవాలి. అంతే టేస్టీ టేస్టీ కరకరలాడే మినప మక్క గారెలు రెడీ. వీటిని పండుగ సమయంలోనే కాకుండా మీకు నచ్చిన సమయంలో చేసుకోవచ్చు. అంతేకాకుండా ఇవి ఎక్కువసేపు కరకరలాడుతూ రుచిగా ఉంటాయి. మరి ఇంకెందుకు ఆలస్యం. ఈ బోనాలకు కాస్త వెరైటీగా ఈ మినప మక్కగారెలు చేసి ఇంటిల్లిపాదికి రుచి చూపించేయండి.

## బోనాల స్పెషల్ బెల్లపు అన్నం..



బోనాలు తెలంగాణ ప్రాంతంలో వైభవంగా జరుపుకునే ఒక ప్రత్యేకమైన జాతర. ఈ పండగ రోజున గ్రామ దేవతలను ఆరాధించడం ఆనవాతిగా వస్తోంది. ఈ రోజు భక్తులంతా ఎంతో భక్తి శ్రద్ధలతో మైసమ్మ, ఎల్లమ్మ, పోచమ్మ వంటి గ్రామ దేవతలను ఈ పండుగ సందర్భంగా ఘనంగా పూజిస్తారు.

ఈ పండగను అన్ని వర్గాల ప్రజలు కలిసి మెలసి జరుపుకుంటారు. ఇది సామాజిక సమైక్యతకు దోహదపడుతుంది. ఈ రోజు అమ్మవార్లకు బోనం కూడా సమర్పిస్తారు. ప్రత్యేకమైన పూజలు చేసి బోనం సమర్పించడం వల్ల కోరుకున్న కోరికలు నెరవేరుతాయని ఒక నమ్మం. బోనాలు అనే పదం భోజనాలు అనే పదం నుండి వచ్చింది.

అంటే దేవతకు నివేదించే భోజనం.. ఈ పండ రోజు భక్తులు మట్టి కుండల్లో బెల్లంతో అన్నాన్ని తయారు చేసి భోజనంగా దేవతకు సమర్పిస్తారు. అందుకే ఈ పండగకి ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉంటుంది. అయితే ఇప్పటికీ చాలా మందికి బెల్లంతో బోనం ఎలా వండాలో తెలియదు. అలాంటి వారికి కోసం తెలంగాణ స్టైల్ బెల్లపు అన్నం రెసిపీని పరిచయం చేయబోతున్నాం.

# మీరు ఎంత కాలం జీవిస్తారో తెలుసుకునేందుకు


శాస్త్రీయ పరిశోధనలు మన జీవితంలో ఎన్నో మార్పులను తీసుకొస్తాయి. అవి మన అనారోగ్యాలను, మన ఆయుష్షును కూడా ముందుగానే అంచనా వేస్తాయి. ఇప్పుడు ఒక చిన్న శారీరక పరీక్ష మన ఆయుష్షును అంచనా వేయగలరని ఒక తాజా అధ్యయనంలో తెలిసింది. యూరోపియన్ జర్నల్ ఆఫ్ ప్రివెంటివ్ కార్డియాలజీ లో ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం సిట్టింగ్ రైజింగ్ టెస్ట్ అనేది మీరు ఎంత కాలం జీవిస్తారో చెప్పేస్తుంది.

**సిట్టింగ్ రైజింగ్ టెస్ట్ ఎలా చేయాలి?** సిట్టింగ్ రైజింగ్ టెస్ట్ అనేది చేయడం చాలా సులువు. దీనికోసం పక్కన వైద్యులు ఉండాల్సిన అవసరం లేదు. అలాగే ల్యాబ్లకు కూడా వెళ్లక్కర్లేదు. ఈ పరీక్ష మీరు ఇంట్లోనే చాలా సులువుగా చేసుకోవచ్చు. సిట్టింగ్ రైజింగ్ టెస్ట్ చేసుకోవడానికి ముందుగా మీరు నేలపై కూర్చోవాలి. ఆ తర్వాత పైకి లేవాలి. ఇది చాలా సింపులే కదా అనుకోవచ్చు. పైకి లేస్తున్నప్పుడు మీరు చేతుల సహాయాన్ని తీసుకోకూడదు. ఏ ఆధారాన్ని పట్టుకోకూడదు. మీకు మీరు కింద మటం వేసుకుని కూర్చొని, అలా లేచి నిల్చోవాలి. ఇది మీ నిలబడే సామర్థ్యాన్ని పరీక్షిస్తుంది. శరీరం ఎంత సమతుల్యంగా, సరళంగా ఉందో కనిపెడుతుంది.

ఈ పరీక్షతో ఆయుష్షు తెలిపోతుంది

ఈ సిట్టింగ్ రైజింగ్ టెస్ట్ అనేది సింపుల్ గా కనిపిస్తున్నా దీనిలో అంచనాలు మాత్రం అధికంగానే ఉంటాయి. మన కండరాల బలం, గుండె ఎలా పనిచేస్తుంది? హృదయనాళ వ్యవస్థ ఎలా ఉంది? అనేది ఈ పరీక్ష ద్వారా తెలిసిపోతుంది. ఈ పరిశోధనలో 46 ఏళ్ల నుంచి 75 సంవత్సరాల మధ్య గల 4 వేల మందికి పైగా వ్యక్తులు పాల్గొన్నారు. తక్కువ మార్కులు పొందిన వారికి మరణం రేటు అధికంగా ఉంటుందని తేల్చి చెప్పారు. కూర్చోవడానికి 5 మార్కులు, నిలబడడానికి ఐదు మార్కులు ఇచ్చారు. 12 సంవత్సరాల పాటు ఈ సిట్టింగ్ రైజింగ్ టెస్ట్ ను చేశారు. ఈ కాలంలో తక్కువ మార్కులు పొందిన వారిలో 665 మంది మరణించినట్టు అధ్యయనంలో తేలింది.

సిట్టింగ్ రైజింగ్ టెస్ట్ చేసిన వారిలో పదికి పది మార్కులు వచ్చిన వారిలో మరణాల రేటు తక్కువగా 3.7 శాతం ఉంది. అదే 8 మార్కులు వచ్చిన వారిలో ఈ రేటు 11 శాతంగా ఉంది. ఇక సున్నా నుంచి నాలుగు మార్కుల మధ్య వచ్చిన వారిలో మరణాల రేటు 42 శాతంగా ఉన్నట్టు గుర్తించారు.




సిట్టింగ్ రైజింగ్ టెస్ట్ లో మార్కులు తక్కువ పొందిన వారిలో గుండె పని చేసే సామర్థ్యం బలహీన పడినట్టు గుర్తించారు. ధమనులు గట్టిపడటం, రక్త ప్రసరణ సరిగా జరగకపోవడం వల్ల వీరికి అకాల వృద్ధాప్యం వచ్చినట్టు తెలుస్తోంది. అలాగే హృదయం కొట్టుకునే వేగాన్ని నియంత్రించే నాడీ వ్యవస్థ కూడా బలహీనపడి వారికి త్వరగా మరణం సంభవించినట్టు చెబుతున్నారు. ఈ సిట్టింగ్ రైజింగ్ టెస్ట్ ను ఎవరైనా ఇంట్లోనే చేసుకోవచ్చు. ఎలాంటి చేతుల సాయం మద్దతు లేకుండా కింద మటం వేసుకొని కూర్చుని అలాగే ఎలాంటి ఆధారం మద్దతు లేకుండా నిల్చోవాలి. అలా నిల్చోగలిగితే మీ ఆరోగ్యం చక్కగా ఉన్నట్టే.

సూర్య
www.suryaa.com
29.6.2025



# ఆషాఢం వచ్చింది బోనాల పండుగ తెచ్చింది



**కంప్యూటర్లు కాంక్రీటు గోడల మధ్య నలిగిపోతున్న నాగరిక నగరం ఒక్కసారిగా గ్రామంగా మారిపోతే... అదొక విచిత్రం. కానీ, రాష్ట్ర రాజధాని ఏడాదికి నెల రోజుల పాటు పల్లె పడుచులా మారిపోతుంది. వాహనాల హెూరు.. తీరిక లేని యాంత్రిక జీవితంలో అలసటే తప్ప ఆహ్లాదం లేని హైదరాబాద్ వాతావరణం ఆషాఢం వచ్చేసరికి ఆనందంతో గంతులు వేస్తుంది. మహానగరాన్ని ఒక్కసారిగా పల్లె వాతావరణం కమ్మేస్తుంది. గ్రామదేవతలు కళకళలాడతారు. సంతసంతో సంబరాలు చేసుకుంటారు. జానపదులు తమ సాంస్కృతిక విశ్వరూపాన్ని ప్రదర్శిస్తారు. దానిపేరే బోనాలు... మరిన్ని వివరాలలోకి వెళితే...**

ఆషాఢం అడుగుపెట్టడంతోనే తొలకరి పలకరిస్తుంది. ప్రకృతి పులకరిస్తుంది. ఎప్పుడైనా సరే.. ఏ వాతావరణంలోనైనా సరే, పులకించిన ప్రకృతి కరుణిస్తే ప్రపంచం ఆనందంతో పల్లవిస్తుంది. ఆగ్రహిస్తే అల్లాడిపోతుంది. ప్రకృతి స్వరూపమైన అమ్మవారిని ఒక్కో ప్రాంతంలో ఒక్కో సమాజం ఒక్కో రకంగా పూజిస్తుంది. తెలంగాణ పల్లె సీమలయితే ఆ ఆమ్మకు సాదరంగా భోజనం అనే బోనం సమర్పించి ఆశీస్సులు పొందుతాయి.. బోనాల సమ-ర్పణతో యావత్ తెలంగాణ ఆనందంతో పరవశించిపోతుంది. దేశంలోనే నెల రోజుల పా టు జరుపుకునే పండుగ ఒక్క బోనాలు మాత్రమే.. ఆషాడ మాసం మొదటి ఆదివారం రోజున ఖిలా గోల్కొండలోని గదాంబికా ఆలయంలో ప్రత్యేక పూజలతో బోనాల పండుగకు శ్రీకారం చుడతారు. అప్పటి నుంచి ప్రతి రోజూ సాధరాణ పూజలు కొనసాగుతాయి. ప్ర తి గురువారం, ఆదివారం( ఆషాడ మాసం) ఉదయంనుంచి రాత్రి పొద్దుపోయే వరకు బోనాలు సమర్పించే భక్తులతో గోల్కొండకోట కిటకిటలాడుతంది. కొం డపై వెలిసిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు దూర ప్రాంతాల నుంచి తరలివస్తుంటారు.



గోల్కొండ పరిసర ప్రాం తాల్లోని కుటుంబాలు ఈ రెండు వారాలపాటు దూర ప్రాంతా ల్లోని బంధుమిత్రులను, ఆడపడుచులను ఇంటికి ఆహ్వానించి బోనాలు తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించి మొక్కు లు తీర్చుకుంటారు. ఆషాడ మాసంలో మూడో ఆదివారం సికింద్రాబాద్లోని ఉజ్జయిని మహంకాళికి బోనాలు సమర్పి స్తారు. సికింద్రాబాద్ పరిసరాల్లో నివసించే కుటుంబాలు తె లంగాణ జిల్లాల్లో నివసించే తమతమ బంధు మిత్రు లను, స్నేహితులను ఆహ్వానించి వేడుకలు జరుపుకుంటారు.

ఆ తర్వాత వారం లాల్దర్వాజా సిం హవాహిని, హరిబౌలి అక్క న్న-మాదన్న మహంకాళి బోనా లనూ బంధుమిత్రులతో కలసి జరుపుకుంటారు. ఇతర ఏ పం డుగల్కెనా ఒకే రోజున జరుగుతాయి. ఆ రోజు బంధువులను ఆహ్వానిస్తే %%. మీరే మా ఇంటికి రండి అని ఎదురు ఆహ్వానాలందుతాయి. దీంతో పరస్పరం కలుసుకుని పండగ జరుపుకోవడం సాధ్యం కాదు. బోనాలు అలా కాదు. నెల రోజుల పాటు జరుపుకోవడం ద్వారా వారింటిలో జరిగే బోనాలకు వీరు%% వీరింటిలో జరిగే వేడుకలకు వారు%% వెళ్లేందుకు అకాశం లభిస్తుంది. మరో విశేషమేమిటంటే%%. నగరంలో ఆషాడ మాసంలో జరిగే బోనాలు గ్రామాల్లో శ్రావణమాసంలో జరుగుతాయి. గ్రామాల్లో కులవృత్తుల సంప్రదాయం ప్రకారం బోనాల వేడుకలను ను భారీ ఎత్తున నిర్వహిస్తారు.

**వర్షాకాలం ప్రారంభంలోనే ..**

తెలంగాణ పల్లెల్లో.. ముఖ్యంగా రాజధాని భాగ్యనగరంలో పచ్చని బోనాలు బయలు దేరుతాయి. శివసత్తులు చిందులేస్తారు. పోతరాజులు వీరంగం వేస్తారు.. అబలలపై అమ్మవారు పూని భవిష్య వాణి ప్రబోధిస్తుంది. అదొక పండుగ..కాదు... నెల రోజుల పాటు వైభవంగా సాగే అపురూపమైన సంబరాలు.. అంతకు మించిన జాతరలు. వేల ఏళ్ల తెలంగాణ గ్రామీణ సంస్కృతికి నిలువుటద్దాలు.... కులమతాలకు అతీతంగా అందరూ ఆప్యాయంగా, అనురాగంగా చేసుకునే బోనాలు........ అవి భోజనాలు...

**ఆషాఢ మాసంలో ప్రతి ఆదివారం ..**

రాజధాని హైదరాబాద్ బోనాల హడావుడి మొదలవుతుంది. తెలంగాణకు చెందిన వారి ప్రతి ఇంటా బోనం లేస్తుంది. అమ్మకు భోజనం పెట్టడానికి పురుషులు, ఇల్లాళ్లు, కన్నెపిల్లలు.... ఇలా ఒకరేమిటి వయోలింగ భేదం లేకుండా అంతా ఆలయాలకు తరలివెళ్తారు. ఈ పండుగ మత సామరస్యానికి ప్రతీక అయిన హైదరాబాద్ పాతబస్తీలోనే ప్రారంభమవుతుంది. గోలకొండ ప్రాంతంలోని అక్కన్న మాదన్న దేవాలయంలో బోనాల జాతర ప్రారంభమవుతుంది. అమ్మవారికి ఘటాలు సమర్పిస్తారు. ఇక అక్కడి నుంచి జాతర ప్రారంభమవుతుంది. హైదరాబాద్లోని వాడవాడలా, వీధి వీధినా వెలసిన అమ్మవార్ల దేవాలయాలన్నింటిలోనూ బోనాల సంబరాలు వారం వారం జరుగుతాయి. అమ్మకు కొత్త బియ్యంతో భోజనం వండి కొత్త కుండలో తీసుకువచ్చి సమర్పిస్తారు.. మాంగల్యానికి అధిదేవత అయిన అమ్మకు పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమనిచ్చి ఇంటి పెద్ద ఆడపడుచుగా ఆరాధిస్తారు. సాధారణంగా ఆషాఢంలో అత్తా అల్లుళ్లు, అత్తా కోడళ్లు ఒక గడప దాటవద్దని చెప్తారు. కానీ, ఆషాఢమాసం తెలంగాణకు సంబంధించినంత వరకు, ఇంకా చెప్పాలంటే హైదరాబాద్కు చెందినంతవరకు కొత్త అల్లుళ్లకు మహా సంబరాలు చేసుకునే మాసం. ఇక్కడ అమ్మకు బోనాలు సమర్పించటానికి కొత్త అల్లుళ్లు ప్రత్యేకంగా అత్తవారిళ్లకు వస్తారు. తొట్టెల తీసుకువెళ్తారు. అమ్మ బండి ముందు తీన్మార్ అడతారు.

**(మిగతా 8వ పేజీలో)**

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
29.6.2025



(7వ పేజీ తరువాయి)

అ సంబరాలను చూడాల్సిందే.
ఇక పోతరాజుల వీరంగం సరేసరి..బలిష్ఠమైన వ్యక్తులు శరీరం అంతా పసుపు రాసుకుని, కాలికి గజ్జెలు కట్టుకుని వీర నాట్యం చేస్తుంటే అది చూడటానికి రెండు కళ్లు చాలవు... ఇది తెలంగాణకే ప్రత్యేకమైన జానపద నృత్యం. సికిందరాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరలో విశేషంగా చేసుకునే వేడుక ఇది.
ఘటాల సమర్పణ, పోతరాజు నృత్యానికి ఆనందించిన దేవత తన భక్తురాళ్లలో ఒకరికి పూని, భవిష్యవాణి చెప్తుంది. దాన్ని రంగం అని పిలుస్తారు. హైదరాబాద్లో మిగతా అన్ని ఆలయాలకంటే భిన్నంగా సికిందరాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర మూడు రోజుల పాటు జరుగుతుంది. చివరి రోజున రంగం జరుగుతుంది. వాస్తవానికి బోనాలు ప్రారంభమైనప్పటి నుంచీ ప్రతిచోటా మహిళలకు పూనకాలు వస్తూనే ఉంటాయి. పూనకం వచ్చిన మహిళలు భక్తి పారవశ్యంలో ఊగిపోతూనే ఉంటారు. రంగం మాత్రం ప్రత్యేకం. తన%ా % జీవితాన్ని అమ్మవారికి సమర్పించుకున్న ఓ అవివాహిత మహిళ ఈ రంగం చెబుతుంది. సమాజంలో ఏం జరుగబోతుందో రంగం చెబుతుంది. ప్రజలకు జరుగబోయేది తెలియజే స్తుంది. ఈ రంగం ముగిసిందంటే...ముచ్చటగా మూడు రోజులు జరిగిన లష్కర్బోనాల జాతర ముగిసిపోతుంది.

### బోనాలు పుట్టు పూర్వోత్తరాలు

తెలంగాణ పండగలు, జాతరలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు, ఆచారవ్యవహారాలకు అద్దం పడతయి. వీటిని ప్రజలు ఆనందంగా, ఉత్సాహంగా, ఉల్లాసంగా భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. అటువంటి ఒక ముఖ్యమైన పంథగ బోనాలు. తెలంగాణ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా జరుపుకునే పండగ బోనాల పండగ. బోనాల పండగ అనగానే కోలాహలం, ఉరకలెత్తే సంతోషం, కొత్తబట్టలు, పసుపు కుంకుమలు, వేపాకు తోరణాలు . ప్రతీ వీధిలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతుంటయి. ఎవరికి వారు ఒంటరిగా కాకుండా కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు అందరూ కలిసి అమ్మవారి గుడికి వెళతరు. బోనాల పండగరోజు ఆలయాల దగ్గర వినిపించే తెలంగాణ జానపద పాటలుకూడా అమ్మను కొలిచి భక్తి పారవశ్యంలో ముంచేలా ఉంటయి. అమ్మ తన బిడ్డలందరినీ ఎంతో ప్రేమగా చూస్తుంది. అలాగే తప్పు చేస్తే మందలిస్తుంది. అయినా సరే వినకుంటే దండిస్తుంది. అప్పుడు ఆ బిడ్డ తన తప్పు తెలుసుకుని సరియైన మార్గంలో పయనిస్తాడు. అదే అమ్మకు పిల్లలకు ఉన్న అనుబంధం. అదే విధంగా ప్రకృతిమాత లేదా ఆ అమ్మలగన్నయమ్మకు కోపం వస్తే కూడా మనని దండిస్తుంది. ప్రకృతి విలయతాండవం చేస్తుంది. ఎన్నో అనర్థాలు జరుగుతయి. అంటురోగాలు ప్రబలుతయి. 1869 సంవత్సరంలో హైదరాబాదు, సికిందరాబాదు జంటనగరాలలో ఇలాగే మలేరియా వ్యాధి ప్రబలి తీవ్ర జననష్టం జరిగింది. అమ్మకు కోపం వచ్చిందని భావించిన ప్రజలు ఆమెను ప్రసన్నపరచడానికి ఉత్సవాలు , జాతర జరిపించాలని నిర్ణయించారు. అదే బోనాలు. ఈ పండగను ఆషాడ మాసంలో జరుపుకుంటారు. హైదరాబాదు, సికిందరాబాదులోనే కాక మరికొన్ని తెలంగాణా ప్రాంతాలలో ఈ పండగ చాలా వైభవంగా జరుపుకుంటరు. ఈ పండగ ముఖ్య ఉద్ధేశ్యం కలరా, ప్లేగు, మశూచి వంటి అంటు వ్యాధులు ప్రబలకుండా, ప్రకృతి బీభత్సాలు జరగకుండా, పాడిపంటలను, తమ పిల్లలను చల్లగా చూడమని ఆమెకు బోనం సమర్పిస్తరు భక్తులు. ఉగాది తర్వాత చాలా రొజులకు వచ్చే మొదటిపండగ ఇదే.

**భోనం గురించి :** బోనం అంటే భోజనం. శుచిగా అన్నం వండుకుని దానిని ఘటంలో అంటే మట్టికుంఢ లేదా ఇత్తడి గుండిగలో వుంచి దానికి పసుపు, కుంకుమలతో అలంకరించి, వేపాకు తోరణాలు కడతరు. అన్నంలో పసుపు లేదా పాలు చక్కెర కలిపి నైవేద్యం తయారు చేస్తరు. ఆ పాత్ర పైన ఒక ప్రమిదలో దీపం పెట్టి ఇంటి ఇల్లాలు లేదా ఆడపడుచు పట్టుబట్టలు కట్టుకుని, పూలు,నగలు అలంకరించుకుని సంతోషంగా ఆ బోనాన్ని తమ తలపై పెట్టుకుని మంగళవాయిద్యాలు, డప్పుల మధ్య ఊరేగింపుగా వెళ్లి అమ్మకు సమర్పిస్తరు. ఈ ఊరేగింపులో సంప్రదాయిక నృత్యాలు చేస్తరు. ప్రతీ సమూహం వెదురుబద్దలు, రంగు కాగితాలతో తయారుచెసిన తొట్టేలను(ఊయల) కూడా అమ్మవారికి సమర్పిస్తరు. అమ్మకు బోనాలు, తొట్టెలు సమర్పిస్తే అమ్మ శాంతించి తమను, తమ పిల్లలను చల్లగా చూస్తదని భక్తుల నమ్మకం. ఎందుకంటే అప్పుడే వానాకాలం మొదలవుతుంది. ఈ సమయంలో వాతావరణ మార్పు వల్ల కూడా అంటురోగాలు వచ్చే ఉంది.బోనాన్ని తలకెత్తుకున్న మహిళలు ఆ అమ్మయొక్క శక్తి , అంశ అని గౌరవిస్తూ ప్రజలు ఆ మహిళ కాళ్ల మీద నీళ్లు పోస్తారు. అలా చేస్తే అమ్మవారు శాంతిస్తుందని వాళ్ల నమ్మకం.
అదే కాక మరో నమ్మకం కూడా ఉంది. ఆషాడ మాసంలో అమ్మ తన పుట్టింటికి వస్తుంది. తమ కూతుళ్లు పుట్టింటికి వస్తే ప్రత్యేకంగా చూసుకున్నట్టే ప్రజలందరూ వెళ్లి ఆమెను దర్శించి భక్తితో భోనం వడ్డిస్తరు. తెలంగాణా ప్రజలు అమ్మవారిని తమ తల్లిగా, ఇంటి ఆడపడుచుగా భావించి పూజిస్తరు. అమ్మవారి సోదరుడైన పోతురాజుది ఈ సంబరాలలో ముఖ్య పాత్ర. బలిష్టుడైన వ్యక్తి ఒళ్లంతా పసుపు రాసుకుని , వేపాకు మండలు కట్టుకుని , నుదుల పెద్ద కుంకుమ బొట్టుతో , కాలికి గజ్జెలతో కొరడా ఝులిపిస్తూ పూనకం వచ్చినట్టు వీరంగం ఆడుతూ ఉంటడు. అమ్మవారికి సమర్పించే ఫలహారపు బళ్ళను అతనే ముందుండి నడిపిస్తడు.

### జాతి అస్తిత్వానికి ప్రతీకలు.

తెలంగాణ జానపద సంస్కృతి ప్రస్థానంలో బోనాలు జాతి అస్తిత్వానికి ప్రతీకలు. మరి అమ్మకు బోనాలు పెట్టే సంప్రదాయం ఎప్పుడు మొదలైంది? ఎందుకు మొదలైంది? అచ్చమైన జానపదానికి, జాన తెనుగుకి తెలంగాణ నిలువుదర్పణం. ఇక్కడి ప్రజలు చేసుకునే ఏ పండుగలోనైనా, నిర్వహించుకునే వేడుకలోనైనా పల్లె వాసన అణు-వణువునా స్పృశిస్తుంది. ఆప్యాయంగా పలుకరిస్తుంది. తెలంగాణలో వైభవంగా జరిగే ఉత్సవాల్లో మొదటిది బోనాలు..... రెండవది బతుకమ్మ.. రెండూ పల్లెతో, పంటపొలాలతో, ప్రకృతితో ముడిపడి ఉన్నవే. వర్షాకాలం ప్రారంభం కాగానే వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల తమ పిల్లలకు ఎలాంటి అంటువ్యాధులు రాకుండా ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తారు. అందుకోసం ఆమెకు బోనం సమర్పించుకుంటారు. సరిగ్గా ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే సమయం కూడా ఇదే. వానలు బాగా పడి పంటలు సమృద్ధిగా పండి, దిగుబడి గణనీయంగా వచ్చేలా చూడమని ప్రకృతికి అధిష్ఠాన దేవత అయిన అమ్మను ఆరాధించటం బోనాల్లోని ప్రధాన ఉద్దేశ్యం. ప్రత్యేకించి తెలంగాణ ప్రాంతంలో గ్రామదేవతలను పూజించే సంప్రదాయం కాకతీయుల కాలం నుంచి వస్తున్నది. చెరువు కట్టల వద్ద, గట్టుల వద్ద అమ్మవారిని నెలకొల్పి కట్టమైసమ్మగా, గట్టు మైసమ్మగా పూజించే సంప్రదాయం ఉంది. చెరువులకు గండి పడి ఊరిని ముంచకుండా ఉండేలా అమ్మ తమను కాపాడుతుందని ప్రజల విశ్వాసం. అదే విధంగా మిగతా గ్రామదేవతలను పూజించటం ఆచారంగా వస్తున్నది. చెట్లెన్ని నరికినా ఎక్కడో, ఏదో మొదళ్లో దాని జీవం మిగిలే ఉంటుంది. నెమ్మదిగా అది పెరిగి పెద్దదవుతుంది. అదే విధంగా హైదరాబాద్ పల్లె నుంచి పట్టణంగా మారినా, పట్టణం నుంచి నగరంగా మారినా, నగరం నుంచి మెట్రో సిటీగా మారినా ప్రజలకు గ్రామదేవతలపై ఉన్న విశ్వాసం సడలలేదు. బోనాలు ఇవ్వటంలో మార్పు రాలేదు. నగరం ఎంత మారినా, ఈ ప్రాంత ప్రజలు మూలాల్ని మ-రవలేదు. అందుకు ప్రతీక లష్కర్ బోనాలు.

### లష్కర్ బోనాలు

లష్కర్ బోనాల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. జంటనగరాల్లోని అన్ని ఆలయాల్లో జరిగే బోనాల జాతర ఒక ఎత్తు... సికిందరాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో జరిగే బోనాలు మరో ఎత్తు... కోటి రతనాల వీణ తెలంగాణ ముఖచిత్రం ఒక్కసారిగా ఇక్కడ ఆవిష్కారమవుతుందంటే అతిశయోక్తి కాదు.
అంగరంగ వైభవంగా జరిగే లష్కర్ బోనాలు రాష్ట్రంలోనే ప్రసిద్ధమైనవి.. అత్యంత్య ప్రతిష్టాత్మకంగా మూడు రోజుల పాటు సాగే ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దర్శనానికి కేవలం తెలంగాణ ప్రాంతం ప్రజలే కాకుండా, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజలతో పాటు కర్నాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తర లివస్తారు. చిన్నారుల మొదలు వృద్దులు సైతం ఎంతో ఉత్సాహంగా అమ్మవారి మొక్కు తీర్చుకునేందుకు బోనాలు తీసుకొస్తారు. అమ్మవారికి బోనం సమర్పించుకుంటే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల అపార విశ్వాసం. ఆటపాటలతో అపురూపంగా ఉత్సవాలు జరుగుతాయి. ఈ సంబరాల్లో అమ్మవారి తొట్టెల ఊరేగింపు భక్తులకు అదనపు ఆకర్షణ. భక్తుల శక్తిమేరకు తొట్టెల సమర్పణ జరుగుతుంది. ఇంటినుంచి ఊరేగింపుగా భాజాభజంత్రీలతో దేవాలయానికి చేరుకునే సన్నివేశం చూడముచ్చటగా ఉంటుంది.
ఇక రాత్రివేళల్లో చూడాలి అసలైన సంబంరం మొదలవుతుంది. చీకటిపడకముందే గొర్రెపోతులే సారథులుగా అమ్మవారి రథం బండి సుందరంగా అలంకరిస్తారు. పోతురాజుల వీరంగం, చిన్నాపెద్దా తేడాలేకుండా తీన్మార్ డాన్సులు కోలాహలంగా ఉంటాయి. జంటనగరాలలో దాదాపు ప్రతి బస్తీలోనూ, ప్రతి వాడలోనూ ఈ దృశ్యం చూడటానికి రెండు కళ్లూ సరిపోవు...లష్కర్ బోనాల జాతర చివరిరోజు రంగం జరుగబోయేది చెబుతుంది. రాష్ట్ర భవిష్యత్తు గురించి, ప్రజా ఆరోగ్య, సంక్షేమాల గురించి తెలిపేది ఈ రంగమే. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పేదే ఈ లష్కర్ బోనాల జాతర.

### బోనాలు పండుగ

తెలంగాణ ప్రాంత ప్రజలందరు భక్తి శ్రద్ధలతో జరుపుకునే ముఖ్యమైన పండుగ ఆషాడంలో వచ్చే బోనాల పండగ. ఈ పండగ గురించి నేను రాసిన వ్యాసం ఈనెల చిత్ర మాసపత్రికలో ప్రచురింపబడింది. పండగ కూడా ఈ నెలలోనే కదా జరుపుకునేది.భారతావనిలో పండగలకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ప్రతి పండగ వెనుక ఓ ప్రాముఖ్యత ఉంటుంది. పండగలు మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను ప్రతిబింబిస్తాయి. వీటిని ప్రజలు ఆనందంగా, ఉత్సాహంగా, ఉల్లాసంగా భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. అటువంటి ఒక ముఖ్యమైన పంథగ బోనాలు. తెలుగువారి
ముఖ్యంగా తెలంగాణా ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా జరుపుకునే పండగ బోనాల పండగ. బోనాల పండగ అనగానే కోలాహలం, ఉరకలెత్తే సంతోషం, కొత్తబట్టలు, పసుపు కుంకుమలు, వేపాకు తోరణాలు . ప్రతీ వీధిలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతుంటాయి. ఎవరికి వారు ఒంటరిగా కాకుండా కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు అందరూ కలిసి గుడికి వెళతారు. బోనాల పండగరోజు ఆలయాల దగ్గర వినిపించే తెలంగాణ జానపద పాటలుకూడా అమ్మను స్తుతిస్తూ ఉత్తేజపరిచేలా ఉంటాయి. ఆ పాటలకు తాళం వేస్తూ చిందులు వేయక తప్పదు. ఎటువంటి అరమరికలు లేకుండా అందరూ కలిసి జరుపుకునే పండగ ఇది. అమ్మ తన బిడ్డలందరినీ ఎంతో ప్రేమగా చూస్తుంది. అలాగే తప్పు చేస్తే మందలిస్తుంది. అయినా సరే వినకుంటే దండిస్తుంది. అప్పుడు ఆ బిడ్డ తన తప్పు తెలుసుకుని సరియైన మార్గంలో పయనిస్తాడు. అదే అమ్మకు పిల్లలకు ఉన్న అనుబంధం. అదే విధంగా ప్రకృతిమాత లేదా ఆ అమ్మలగన్నయమ్మకు కోపం వస్తే కూడా మనని దండిస్తుంది. ప్రకృతి విలయతాండవం చేస్తుంది. ఎన్నో అనర్థాలు జరుగుతాయి. అంటురోగాలు ప్రబలుతాయి.

(మిగతా 9వ పేజీలో)





నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
29.6.2025



(8వ పేజీ తరువాయి)

1869 సంవత్సరంలో హైదరాబాదు, సికిందరాబాదు జంటనగరాలలో ఇలాగే మలేరియా వ్యాధి ప్రబలి తీవ్ర జననష్టం జరిగింది.
అమ్మకు కోపం వచ్చిందని భావించిన ప్రజలు ఆమెను ప్రసన్నపరచడానికి ఉత్సవాలు , జాతర జరిపించాలని నిర్ణయించారు. అదే బోనాలు. ఈ పండగను ఆషాడ మాసంలో జరుపుకుంటారు. హైదరాబాదు, సికిందరాబాదులోనే కాక మరికొన్ని తెలంగాణా ప్రాంతాలలో ఈ పండగ చాలా వైభవంగా జరుపుకుంటారు. ఈ పండగ ముఖ్య ఉద్ధేశ్యం కలరా, ప్లేగు, మశూచి వంటి అంటు వ్యాధులు ప్రబలకుండా, ప్రకృతి బీభత్సాలు జరగకుండా, పాడిపంటలను, తప పిల్లలను చల్లగా చూడమని ఆమెకు బోనం సమర్పిస్తారు.

### ఉగాది తర్వాత చాలా రొజులకు వచ్చే మొదటిపండగ ఇదే.

బోనం అంటే భోజనం. శుచిగా అన్నం వండుకుని దానిని ఘటంలో అంటే మట్టికుంఢ లేదా ఇత్తడి గుండిగలో వుంచి దానికి పసుపు, కుంకుమలతో అలంకరించి, వేపాకు తోరణాలు కడతారు. అన్నంలో పసుపు లేదా పాలు చక్కెర కలిపి నైవేద్యం తయారు చేస్తారు. ఆ పాత్ర పైన ఒక ప్రమిదలో దీపం పెట్టి ఇంటి ఇల్లాలు లేదా ఆడపడుచు పట్టుబట్టలు కట్టుకుని, పూలు,నగలు అలంకరించుకుని సంతోషంగా ఆ బోనాన్ని తమ తలపై పెట్టుకుని మంగళవాయిద్యాలు, డప్పుల మధ్య ఊరేగింపుగా వెళ్లి అమ్మకు సమర్పిస్తారు. ఈ ఊరేగింపులో సంప్రదాయిక నృత్యాలు చేస్తారు. ప్రతీ సమూహం వెదురుబద్దలు, రంగు కాగితాలతో తయారుచెసిన తొట్టేలను(ఊయల) కూడా అమ్మవారికి సమర్పిస్తారు. అమ్మకు బోనాలు, తొట్టెల సమర్పించి కల్లుతో సాక పెడితే అమ్మ శాంతించి తమను, తమ పిల్లలను చల్లగా చూస్తుందని అందరి నమ్మకం. ఎందుకంటే అప్పుడే వానాకాలం మొదలవుతుంది. ఈ సమయంలో వాతావరణ మార్పు వల్ల కూడా అంటురోగాలు వచ్చే ప్రమాదం ఎలాగూ ఉంటుంది.

### అమ్మ యొక్క శక్తి , అంశ

బోనాన్ని తలకెత్తుకున్న మహిళలు ఆ అమ్మ యొక్క శక్తి , అంశ అని గౌరవిస్తూ ప్రజలు ఆ మహిళ కాళ్ల మీద నీళ్లు పోస్తారు. అలా చేస్తే అమ్మవారు శాంతిస్తుందని వాళ్ల నమ్మకం.అదే కాక మరో నమ్మకం కూడా ఉంది. ఆషాడ మాసంలో అమ్మ తన పుట్టింటికి వస్తుంది. తమ కూతుళ్లు పుట్టింటికి వస్తే ప్రత్యేకంగా చూసుకున్నట్టే ప్రజలందరూ వెళ్లి ఆమెను దర్శించి ప్రేమగా భోజనం పెడతారు. తెలంగాణా ప్రజలు అమ్మవారిని తమ తల్లిగా, ఇంటి ఆడపడుచుగా భావించి పూజిస్తారు. అమ్మవారి సోదరుడైన పోతరాజుది ఈ సంబరాలలో ముఖ్య పాత్ర. బలిష్టుడైన వ్యక్తి ఒళ్లంతా పసుపు రాసుకుని , వేపాకు మండలు కట్టుకుని , నుడుత కుంకుమ బొట్టుతో , కాలికి గజ్జెలతో కొరడా ఝులిపిస్తూ పూనకం వచ్చినట్టు ఆడుతూ ఉంటాడు. అమ్మవారికి సమర్పించే పలహారపు బళ్ళను అతనే ముందుండి నడిపిస్తాడు.
హైదరాబాదు, సికిందరాబాదులో ఈ పండగా వేర్వేరు ప్రాంతాలలో వేర్వేరు రోజులలో జరుగుతుంది. బోనాల పండగ ఆషాడ మాసంలోని ఆదివారం రోజే జరుపుకుంటారు. ఈ పండగ ఆషాడ మాసం మొదటి ఆదివారం రోజు గోల్కొండ కోటలోని జగదంబ ఆలయంలో మొదలవుతుంది. నిజాం నవాబుల కాలం నుండి ఈ ఆనవాయితి కొనసాగుతూ వస్తుంది. రెండో ఆదివారం సికిందరాబాదులోని ఉజ్జయినీ మహంకాళీ మందిరంలో జరుగుతుంది. అప్పుడు సికిందరబాదు వాసులందరూ ఈ పండగ సంబరాలలో ఉత్సాహంగా పాల్గొంటారు. మూడవ ఆదివారం హైదరాబాదులోని అన్ని ప్రాంతాలలో ఈ పండగ ఉ త్సాహంగా జరుపుకుంటారు. ప్రతీ వీధి కళకళ లాడిపోతుంది. చివరి ఆదివారం గన్ ఫౌండ్రిలో ఈ పండగ జరుపుకుంటారు. దీనితో బోనాల పండగకు తెర పడుతుంది. ఏ పండగైనా ప్ర జ ల ం తా ఒ కే రో జు జరుపుకుంటారు. కాని బోనాల పండగను మాత్రం వారానికో ప్రాంతంలో నెలంతా కూడా ఎంతో వైభవంగా జరుపుకుంటారు.

### ఎన్నో పేర్లతో అమ్మవారు

అమ్మవారిని ఎన్నో పేర్లతో కొలుస్తారు. మైసమ్మ, పోచమ్మ, యెల్లమ్మ, పెద్దమ్మ, డొక్కలమ్మ, అంకాలమ్మా, పోలేరమ్మ, మారెమ్మ, యెల్లమ్మ .. అమ్మే కదా యే పేరుతో పిలిచినా పలుకుతుంది , తమని ఆదుకుంటుంది అని ప్రజల ప్రగాఢ విశ్వాసం.. ఆదివారం బోనాలు సమర్పిస్తారు. ఇంతటితో పండగ ఐపోలేదు. మరునాడు ఉదయం రంగం అనే కార్యక్రమం ఉంటుంది. రంగం చెప్పడమంటే అమ్మవారు ఒక అవివాహిత శరీరాన్ని ఆవహించి ఆమె ద్వారా నగర ప్రజలకు రాబోయే ఏడాదిలో జరగబోయే మంచిచెడులను చెబుతుంది. రంగం చెప్పే మహిళ గర్భాలయం ముందు ఒక పచ్చికుండపై నిలబడి, పూనకంతో ఊగిపోతూ భవిష్యత్తు చెబుతుంది. అలాగే ప్రజలు అడిగే ప్రశ్నలకు కూడా జవాబిస్తుంది. వేలాదిమంది భక్తులు ఈ భవిష్యవాణి వినడానికి గుంపు కడతారు.

### రంగం తర్వాత ఘటం ఊరేగింపు.

బోనాల సంబరాలలో చివరి అంకం ఘటం ఊరేగింపు. రంగం తర్వాత సాయంత్రం ప్రతీ ప్రాంతం నుండి వేర్వేరు ఘటాల ఊరేగింపు ప్రారంభమవుతుంది . హైదరాబాదులోని పాతబస్తీలో వీధులన్నీ భక్తులతో కిటకిటలాడతాయి. అలంకరించిన వాహనాలపై అమ్మవారిని ఘటం రూపంలో ఉంచుతారు. ఊరేగింపుగా వెళ్తారు. ఒక్కటొక్కటిగా అన్ని ఘటాల ఊరేగింపులు కలిసిపోయి ఒక్కటిగా సాగుతాయి. ఈ ఊరేగింపులో వివిధ వేషధారణలు, పాటలు, నాట్యాలు, గుర్రాలు కూడా కోలాహలం సృష్టిస్తాయి. ఈ రెండు రోజులు ఎంతో సందడిగా ఉ ంటుంది. ముఖ్యంగా తెలంగాణ జానపద గీతాలు ప్రముఖమైనవి. విన్నవారందరిని చిందులేయించే పాటలు ఎన్నో . డప్పుల దరువుతో సాగిపోయే కోడిబాయె లచ్చమ్మదీ, చుట్టూ చుక్కల చూడు, అమ్మ బయలెల్లినాదే... ఆటపాటలతో సాగిపోయిని ఈ ఘటాలన్నింటిని నయాపుల్ లోని మూసీ నదిలో నిమజ్జనం చేయడంతో బోనాల పండగ సంబరం ముగుస్తుంది. ఇక సంవత్సరమంతా తమ పంటలను , పిల్లలను చల్లగా ఆ అమ్మ చల్లగా చూసుకుంటుంది అని నిశ్చింతగా ఇళ్లకు తిరిగి వెళతారు భక్తులు..

### జంటనగరాల జాతర

ఈ పండగ హైదరాబాదు, సికిందరాబాదులో వేర్వేరు ప్రాంతాలలో వేర్వేరు రోజులలో జరుగుతుంటది. బోనాల పండగ ఆషాడ మాసంలోని ఆదివారం రోజే జరుపుకుంటారు. ఈ పండగ ఆషాడ మాసం మొదటి ఆదివారం రోజు గోల్కొండ కోటలోని జగదంబ ఆలయంలో మొదలవుతుంది. నిజాం నవాబుల కాలం నుండి ఈ ఆనవాయితి కొనసాగుతూ వస్తుంది. రెండో ఆదివారం సికిందరాబాదులోని ఉజ్జయినీ మహంకాళీ మందిరంలో జరుగుతది. అప్పుడు సికిందరబాదు వాసులందరూ ఈ పండగ సంబరాలలో ఉత్సాహంగా పాల్గొంటరు. మూడవ ఆదివారం హైదరాబాదులోని అన్ని ప్రాంతాలలో ఈ పండగ ఉత్సాహంగా జరుపుకుంటారు. ప్రతీ వీధి తోరణాలతో కళకళ లాడిపోతుంటది. చివరి ఆదివారం గన్ ఫౌండ్రిలో ఈ పండగ జరుపుకుంటారు. దీనితో బోనాల పండగకు తెర పడుతది. ఏ పండగైనా ప్రజలంతా ఒకేరోజు జరుపుకుంటరు. కాని బోనాల పండగను మాత్రం వారానికో ప్రాంతంలో నెలంతా కూడా ఎంతో వైభవంగా జరుపుకుంటరు.

### జాతర జరిగే విధానం

అమ్మవారిని ఎన్నో పేర్లతో కొలుస్తారు. మైసమ్మ, పోచమ్మ, యెల్లమ్మ, పెద్దమ్మ, డొక్కలమ్మ, అంకాలమ్మా, పోలేరమ్మ, మారెమ్మ, యెల్లమ్మ .. అమ్మే కదా యే పేరుతో పిలిచినా పలుకుతది , తమని ఆదుకుంటుంది అని ప్రజల ప్రగాఢ విశ్వాసం.. ఆదివారం బోనాలు సమర్పిస్తరు. ఇంతటితో పండగ అయిపోలేదు. మరునాడు ఉదయం రంగం అనే కార్యక్రమం ఉంటది. రంగం చెప్పడమంటే అమ్మవారు ఒక అవివాహిత శరీరాన్ని ఆవహించి ఆమె ద్వారా నగర ప్రజలకు రాబోయే ఏడాదిలో జరగబోయే మంచిచెడులను చెబుతుంది. రంగం చెప్పే మహిళ గర్భాలయం ముందు ఒక పచ్చికుండపై నిలబడి, పూనకంతో ఊగిపోతూ భవిష్యత్తు చెబుతది. అలాగే ప్రజలు అడిగే ప్రశ్నలకు కూడా జవాబిస్తది. వేలాదిమంది భక్తులు ఈ భవిష్యవాణి వినడానికి గుంపు కడతరు.
బోనాల సంబరాలలో చివరి అంకం ఘటం ఊరేగింపు. రంగం తర్వాత సాయంత్రం ప్రతీ ప్రాంతం నుండి వేర్వేరు ఘటాల ఊరేగింపు ప్రారంభమవుతుంది . హైదరాబాదులోని పాతబస్తీలో వీధులన్నీ భక్తులతో కిటకిటలాడతాయి. అలంకరించిన వాహనాలపై అమ్మవారిని ఘటం రూపంలో ఉంచుతారు. ఊరేగింపుగా వెళ్తారు. ఒక్కటొక్కటిగా అన్ని ఘటాల ఊరేగింపులు కలిసిపోయి ఒక్కటిగా సాగుతాయి. ఈ ఊరేగింపులో వివిధ వేషధారణలు, పాటలు, నాట్యాలు, గుర్రాలు కూడా కోలాహలం సృష్టిస్తయి. ఈ రెండు రోజులు ఎంతో సందడిగా ఉంటుంది. ముఖ్యంగా తెలంగాణ జానపద గీతాలు ప్రముఖమైనవి. విన్నవారందరిని చిందులేయించే పాటలు ఎన్నో . డప్పుల దరువుతో సాగిపోయే అమ్మ బయలెల్లినాదే... ఆటపాటలతో సాగిపోయిన ఈ ఘటాలన్నింటిని నయాపుల్ లోని మూసీ నదిలో నిమజ్జనం చేయడంతో బోనాల పండగ సంబరం ముగుస్తుంది. ఇక సంవత్సరమంతా తమ పంటలను , పిల్లలను చల్లగా ఆ అమ్మ చల్లగా చూసుకుంటుంది అని నిశ్చింతగా ఇళ్లకు తిరిగి వెళతారు భక్తులు..

### అలయ్ బలయ్

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అలయ్ భలయ్ అంటే స్నేహసమ్మేళనం ఈ సందడిలో ఏర్పాటు చేసిన వివిధ కళారూపాలను చూసి ముగ్ధుడైన.. తెలంగాణ ప్రజల జీవన విధానాన్ని వివరిస్తూ పాటలు పాడారు. లయబద్ధంగా చిందేస్తూ అందర్నీ ఉర్రూతలూగించారు. తెలంగాణ జానపద కళారూపాలైన ఒగ్గుకథ లు, గోండు నృత్యం, పీర్లు, గొర్లకాపరులు, పోతరాజులు, సాధ్యశూరులు, బోణాలు, బంతిపూల బతుకమ్మ లు, గంగిరెద్దులు, సీతమ్మ జడకొప్పులు వంటి వాటితోపాటు, కోలాటాలు, భజనకీర్తనలు, సన్నాయి బాజాలు, జమిడిక మోతలు,బోనాలు,ఘటాలు, వంటివి విశేషంగా ఆకట్టుకుంటాయి.తెలంగాణా వంటకాలు సద్దఅప్పలు ,జొన్నరొట్టెలు,మక్కగారెలు, మాలీదా,యాటవేపుడు,కోడిపులుసు,పొట్టురొయ్యలు, గుడాలు,బుడాలు, అటుకులచుడువా వడ్డించారు.

### బంధాలు, అనుబంధాల వేదిక బోనాల వేడుక

బోనాల పండుగ అనగానే తెలంగాణ ప్రాంత ప్రజల మనస్సులు పులకరిస్తాయి. పురాణగాధలు, చారిత్రక సంఘటనలతో సంబం ధం లేకుండా ఆయా ప్రాంతాల ప్రజలు బంధుమిత్రుల కుటుం బాలతో కలిసి మెలిసి ఈ పండుగ జరుపుకుంటారు. గ్రామీణ వాతావరణంలో నివసించే కుటుంబాల్లో బంధాలను–అను బంధాలను పెంపొందించే వారిధి బోనాలు. భాగ్య నగరవాసుల ప్రత్యేక పండుగగా ఇది సుప్రసిద్ధం. ఒకప్పటి గ్రామాలు కలిసి ఏర్పడిన నగరం మన హైదరాబాద్. గ్రామీణ ప్రాంతాల నుంచి అవసరాల కోసం తరలివచ్చిన కుటుంబాలు ఇక్కడ స్థిరపడ డంతో నగరవాతావరణంలో సైతం బోనాల పండుగకు ప్రాధాన్యత ఏర్పడింది. నిర్ధిష్టమ్కైన తిధి, వార నక్షత్రాలు లేకుండా ఆయా ప్రాంతాల ప్రజలకు వెసులుబాటు ఉన్న రోజున జరుపుకోవడమే ఈ ఉత్సవాల విశిష్టత. అందుకే కులీకుతుబ్ షాల కాలంలో ప్రారంభమ్కైన బోనాలు ప్రతి సంవత్సరం రాజ్య దానిలో సుమారు నెలరోజుల పాటు వ్కైభవోపేతంగా జరుగుతుంది.
కులీకుతుబ్షా పాదుషాల రాజధాని కేంద్రం గోల్కొండలోని జగదాంబిక ఆలయంలో ఆషాడమాసంలో మొదటి ఆదివారం ప్రారంభమయ్యే ఈ వేడుకలు ఆ తర్వాత లష్కర్ (సికింద్రాబాద్) ఉజ్జయిని మహంకాళి ఆలయంలో కన్నుల పండువగా సాగి, చివరి వారం చారిత్రక లాల్దర్వాజా సింహవాహని, హరిబౌలి అక్కన్న–మాదన్న మహంకాళి ఆలయాల్లో బోనాల సమర్పించి లక్షలాది మంది భక్తుల జ్కై జ్కైధ్వానాల మధ్య నయాపూల్ సమీపంలోని ముచుకుందానదీ తీరానికి అమ్మవారి ఘటాల ఉమ్మడి ఊరేగింపుతో పరిసమాప్త మవుతుంది. గోల్కొండ ఖిల్లాలోని జగదాంబికా ఆలయంలో జరిగే బోనాలకు అయిదు వందల ఏళ్ల, సికింద్రాబాద్ లోని ఉజ్జయిని మహంకాళి బోనాలకు సుమారు రెండువందల ఏళ్ల చరిత్ర ఉంది
ఇక ఇకులీకుతుబ్షాల చివరి పాదుషా అబ్దుల్ హసన్ తానీషా కొలువులో కీలకమ్కైన బాధ్యతలు నిర్వహించిన అక్కన్న–మాదన్న ల పూజలందుకున్న హరిబౌలిలోని మాతా మహంకాళి నిజాం నవాబుల కాలంలో కొన్నేళ్లపాటు ప్యాలెస్ అంతర్భాగంలోకి వెళ్లిపోయింది. హైదరాబాద్ రాష్ట్ర విముక్తి పోరాటం ఫలితంగా మళ్లీ వెలుగుచూసింది. 1948లో మళ్లీ భక్తులకు అందుబాటు లోకొచ్చింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతియేటా ఆషాడబోనాల ఉత్సవాలు భారీ ఎత్తున జరుగుతు న్నాయి. అక్కన్న–మాదన్న మాతా మహంకాళి ఆలయంగా సుప్రసిద్ధమ్కైన హరిబౌలి ఆలయంలో బోనాల రోజున రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టుచీరను కానుకగా సమర్పించే సంప్రదాయం కొనసాగుతున్నది



సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
29.6.2025
ఆదివారం అనుబంధం

## ఆమీర్ ఖాన్ 'సితారే జమీన్ పర్' రివ్యూ

### క్లైమాక్స్లో బిల్డప్ కోసం డ్రామా పెంచని కొత్త ప్రయోగం ఈ సినిమా

తారే జమీన్ పర్, 3 ఇడియట్స్, దంగల్ వంటి చిత్రాలతో భారతీయ సినిమా ఎమోషన్ రూల్స్ ని తిరగరాసిన నటుడు ఆమిర్ ఖాన్, మళ్ళీ తన క్లాసిక్ టెర్రిటరీలోకి అడుగుపెట్టాడు. ఈసారి కూడా అదే పంథాలో, కానీ కొత్త సమస్య, కొత్త పాయింట్తో:"సితారే జమీన్ పర్" అనే టైటిల్ అంటూ మన ముందుకొచ్చాడు.కానీ మళ్లీ మరో ప్రయోగం...సాధారణ పిల్లల గురించి కాదు. సాధారణమైన మనుషుల గురించి. ఇంతవరకూ మనం 'ఇంటలిజెన్స్' కొలిచిన ప్రమాణాలు సరైనవేనా? అనే ప్రశ్నకి సమాధానంగా, నవ్వుల మధ్యలో కన్నీళ్లు, వాస్తవాల మధ్యలో విజయం... ఇవన్నీ కలిపే ప్రయత్నమే ఈ చిత్రం. ఇంతకీ ఈ చిత్రం మనకు నచ్చుతుందా, అమీర్ ఖాన్ ని మరిన్ని ఇలాంటి ప్రయోగాలు తీసే దిశగా ప్రేరేపిస్తుందా, ఈ సినిమా కమర్షియల్ సక్సెస్ ఇస్తుందా ..చూద్దాం.స్టోరీ లైన్:గుల్షన్ అరోరా (ఆమిర్ ఖాన్) బాస్కెట్బాల్ అసిస్టెంట్ కోచ్. వ్యక్తిగతంగా కొద్దిగా అహంకారి. ఢిల్లీ జట్టు హెడ్ కోచ్తో గొడవపడి, కోపంలో అతడిపై దాడికి దిగతాడు. ఆగ్రహాన్ని మద్యంలో ముంచుతూ రాత్రివేళ కారు నడిపి, నేరుగా పోలీస్ వాహనాన్నే ఢీకొంటాడు. దీని ఫలితం జైలులో శిక్ష కాదు.. కానీ జీవితాన్ని మార్చేసే సోషల్ సర్వీస్ .

కోర్టు తీర్పు: మానసిక దివ్యాంగులైన 10 మందికి బాస్కెట్బాల్లో శిక్షణ ఇవ్వాలి , అదీ మూడునెలల పాటు! మొదట అసహనం, అలసటతో ప్రారంభమైన ఈ జర్నీ నెమ్మదిగా గుల్షన్ మనసును, దృష్టిని మార్చేస్తుంది.ఓ కోచ్గా గేమ్ నేర్పించేందుకు వచ్చిన గుల్షన్ జీవితాన్ని నేర్చుకుంటాడు. మాటలు స్పష్టంగా పలకలేని వారి భావాలు అతడిని కదిలిస్తాయి. "వాళ్ల జీవితాల్లోకి వెళ్లినప్పుడే తన జీవితంలో ఏం ఖాళీగా ఉందో గ్రహిస్తాడు."ఈ క్రమంలో భార్య సునీత (జెనీలియా)తో దూరమైన అతడి బంధం%ౌ % తిరిగి దగ్గరవుతుందా?అతడు రూపొందించిన 'సితారే' టీమ్ ,నేషనల్ బాస్కెట్బాల్ ఛాంపియన్షిప్ గెలవగలదా?వాళ్ల విజయానికంటే ముఖ్యంగా, గుల్షన్ ఎలా మారాడు అన్నదే అసలైన క్లైమాక్స్!విశ్లేషణ:"సితారే జమీన్ పర్" సినిమా స్పానిష్ మూవీ 'చాంపియన్స్' ఆధారంగా తీసిందే కావచ్చు... కానీ ఆమిర్ ఖాన్ చూపించిన భావోద్వేగం మాత్రం ఖచ్చితంగా లోకల్ దే, నిజమైనది, మన హృదయానికి పట్టేదే. సినిమా టైటిలే చెప్పకనే చెప్పింది. ఇది గెలుపు గురించిన కథ కాదు, మార్పు చెందే కథ అని.ఒక కోచ్ తప్పు చేశాడు. కోర్టు అతడికి శిక్ష విధించలేదు .బదులుగా బాధ్యత ఇచ్చింది. అదే కథ తొలి వాక్యం.

కానీ స్క్రీన్ప్లే దీన్ని మామూలు మేసేజ్ లా కాకుండా ఇంట్రస్టింగ్ గా మలవటం జరిగింది. మొదట్లో గుల్షన్ అరోరా (ఆమిర్ ఖాన్) పాత్ర 'బాధ్యత' అనే పదాన్ని తేలిగ్గా తీసుకుంటుంది. అతడి కోపం, అహంకారం అతనికి ఉన్న సామర్థ్యాన్ని మసకబారుస్తాయనేది ఎస్టాబ్లిష్ చేస్తుంది.కానీ స్క్రీన్ప్లే అతడి లోపల జరిగే మార్పుని చాలా జాగ్రత్తగా మలచింది.

అతడు తన స్టూడెంట్స్ ని చూసి నవ్వుతాడు. తర్వాత వాళ్లతో మాట్లాడటానికి భయపడతాడు. చివరికి వాళ్లకు కోచ్గా మారుతాడు. కానీ అతడు సరికొత్త మనిషిగా మారే పాయింట్ మాత్రం కన్నీళ్లు పెట్టే క్షణంలో వస్తుంది.ఈ మార్పు కోసం స్క్రీన్ప్లే కొన్ని చోట్ల మౌనాన్ని ఎంచుకుంది. ఎక్కడా పెద్దగా ప్రవచనాలు ఇవ్వలేదు. ఆమిర్ మద్యం తాగుతూ, బాధను హాస్యంలో మిక్స్ చేస్తాడు. "నిజమే సర్ మాలాగా పిల్లలు పుట్టకూడదు" అని ఒక మానసిక దివ్యాంగుడు చెప్పినప్పుడు... అతడి కనుసైగ ఒక్కసారి మన గుండెని తడుముతుంది. అదే స్క్రీన్ప్లే విలువ.ఇదంతా సోషల్ యాంగిల్ తో మేల్కొలిపే సినిమాలు ఎలా ఉండాలి? అనే ప్రశ్నకు సమాధానం. మ్యాచ్ విజయం .అది సినిమా ముగింపు కాదు.

గుల్షన్ గొప్ప కోచ్గా మారిన విధానం కథకు ముగింపు.రీసెంటుగా స్క్రీన్ప్లేలు మొత్తం కమర్షియల్ ప్యాకేజీలా ఉంటే ఇందులోని స్క్రీన్రైటింగ్ ఆలోచన ఆ దిశకి వ్యతిరేకంగా పోతుంది. ఇది క్లైమాక్స్లో బిల్డప్ కోసం డ్రామా పెంచదు. ఎందుకంటే, మనకు చూపించాల్సింది గెలుపు కాదు, ప్రేమకు అర్హత ఉన్న మనిషిగా మారిన ఓ కోచ్.టెక్నికల్ గా...బ్యాక్గ్రౌండ్ స్కోర్ హృదయానికి తాకుతుంది, సినిమాటోగ్రఫీ ప్రేక్షకుడిని కోర్టులోనో, ఆ పిల్లల గుండెల్లోనో నడిపిస్తుంది. ప్రతి ఫ్రేమ్ ఎమోషన్తో




నిండినట్టు అనిపిస్తుంది. అయితే అన్నీ బాగున్నా లెంగ్త్ మాత్రం కథనం మీద భారం వేసిన భావన కలిగిస్తుంది.బాస్కెట్బాల్ భారత్లో అంతగా తెలిసిన క్రీడ కాదు. అలాంటపుడు, 'ఛాంపియన్స్' అనే స్పానిష్ చిత్రాన్ని ఆదారంగా తీసుకుని అదే ఆటను కేంద్రంగా నడిపే స్క్రీన్ప్లే ు సినిమాకి కొన్నిచోట్ల ఇబ్బందిగా అనిపించింది. ముఖ్యంగా సెకండాఫ్ లో మ్యాచ్లు వరుసగా జరుగుతూ 'సితారే' టీమ్ అన్నీ గేమ్స్ గెలుస్తూ ఫైనల్స్ వరకు రావడం కొంచెం ఫార్ములా స్క్రీన్ప్లే గెటప్పు తలపిస్తుంది. బోర్ కొడుతుంది.ప్రీ క్లైమాక్స్ దాకా కథనం అందుకోదు.

దర్శకుడు ఆర్.ఎస్. ప్రసన్న సున్నితమైన ఎమోషన్లను చక్కగా తీర్చిదిద్దినా, ఫ్యామిలీ డ్రామా కొద్దిగా కత్తిరించి, మ్యాచ్ సన్నివేశాలకు కొద్దిగా టెన్షన్, స్పైస్ పెంచి ఉంటే సినిమా మరింత ఎంగేజింగ్గా ఉండేదని అనిపించకమానదు. విషయం ఎక్కడ డల్ అవుతుందో తెలుసుకుని, అక్కడే బలం పెంచే ప్రయత్నం చేయడం ు అది మంచి దర్శకుడి గుణం.ఇక అమీర్ ఖాన్... బాస్కెట్ బాల్ కోచ్ గుల్షన్ అరోరా పాత్రలో ఒదిగిపోయారు. మిగతా వాళ్లు బాగానే చేసారు.

ఫైనల్ థాట్:అది స్పానిష్ మూలం నుంచి తీసుకున్న కథ అయితే ఏమిటి? మన లోపల మనిషిని చూసే దృష్టిని మాత్రం పూర్తిగా మన సాంప్రదాయమే ఆవిష్కరించింది. సినిమా కథ ఏ దేశానిదైనా స్క్రీన్ప్లే మనసుని తాకితే అది మనదే అవుతుంది.

'సితారే జమీన్ పర్' మనల్ని మనమే గెలిపించుకున్న కథ.

---




కథ:

నాస్తికుడిగా పెరిగే తిన్నడు అనే గిరిజన యువకుడి ప్రయాణాన్ని కన్నప్ప అనుసరిస్తుంది. శ్రీ కాళహస్తి ఆలయ చరిత్ర నుండి ప్రేరణ పొందిన ఈ చిత్రం తిన్నడు యొక్క అంతర్గత సంఘర్షణ మరియు పురాతన ఆచారాలకు వ్యతిరేకంగా తిరుగుబాటును అన్వేషిస్తుంది. చివరికి అతను ప్రేమలో పడతాడు మరియు తన గ్రామానికి చెందిన అమ్మాయిని (ప్రీతి ముఖుందన్ పోషించిన పాత్ర) వివాహం చేసుకుంటాడు.

కథ యొక్క మూలం తిన్నడు ఒక అవిశ్వాసి నుండి శివుని అంకితభావంతో ఉన్న అనుచరుడిగా ఎలా మారతాడో, కన్నప్ప పురాణ భక్తి యొక్క ఆధ్యాత్మిక సారాన్ని ఎలా సంగ్రహిస్తాడో దానిలో ఉంది.

విశ్లేషణ:

చివరి 40 నిమిషాలలో, ముఖ్యంగా భావోద్వేగపరంగా ప్రతిధ్వనించే క్లైమాక్స్ సమయంలో, ఇది అన్ని వర్గాల ప్రేక్షకులతో కనెక్ట్ అయ్యే అవకాశం ఉంది. రుద్ర (ప్రభాస్ పోషించిన) ప్రీ-క్లైమాక్స్ భాగాలను మర్యాదగా నిర్వహిస్తారు. ప్రభాస్ తన గురువు పాత్రకు ప్రశాంతత మరియు స్వరపరచిన ఉనికిని తెస్తుంది. అయితే, మిగిలిన సినిమా కొన్నిసార్లు ఇబ్బంది పడుతోంది, ప్రేక్షకులను పూర్తిగా నిమగ్నం చేయడానికి ఒక సమగ్ర కథన థ్రెడ్ లేకపోవడం. మొదటి సగం మొత్తం చాలా అందంగా ఉంది. పాటల సన్నివేశాలు మరియు లొకేషన్లు చూడదగినవి కానీ భక్తి సినిమాలో అంతగా సరిపోవు. హీరోయిన్ ప్రీతి పాత్రకు బాగా సరిపోతుంది.

శివుని చుట్టూ కేంద్రీకృతమై ఉన్న భక్తి పాటలు మరియు సాహిత్యం ఆకట్టుకుంటాయి మరియు సినిమా ఆధ్యాత్మిక స్వరానికి తోడ్పడతాయి. అయితే, సంభాషణలు మొత్తం మీద భావోద్వేగ లోతును కలిగి లేవు. చిన్న తిన్నడు పాత్రను మంచు విష్ణు కుమారుడు పోషించాడు, కానీ అతని డబ్బింగ్ (సంభాషణ డెలివరీ) చాలా చెడ్డది (ఇంగ్లీష్ యాస).

కిరాతగా మోహన్ లాల్ అతిథి పాత్రలో నటించాడు, మహాదేవ శాస్త్రిగా మోహన్ బాబు మంచి పాత్ర పోషించాడు. మరియు ఇద్దరూ తమ అనుభవాన్ని చూపిస్తారు. తమిళ సీనియర్ హీరో శరత్ కుమార్ కన్నప్ప తండ్రి పాత్రను పోషించారు. శివుడిగా అక్షయ్ కుమార్ మరియు కాజల్ అగర్వాల్ మరియు పార్వతి పాత్రలకు సరిపోతారు

సాంకేతికత:

క్లైమాక్స్‌లో %ఎఖీశ% చాలా బాగుంది మరియు కథనాన్ని బాగా పూర్తి చేస్తుంది. సినిమా మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ విలువలు సరిపోతాయి. ముఖ్యంగా, ఈ చిత్రాన్ని సెట్లపై ఆధారపడకుండా న్యూజిలాండ్‌లోని సహజ ప్రకృతి దృశ్యాలలో చిత్రీకరించారు.

నిర్మాత మరియు ప్రధాన నటుడిగా తన ద్విపాత్రాభినయం కోసం మంచు విష్ణు ప్రశంసలు అందుకోవాలి. అనేక సవాళ్లు ఉన్నప్పటికీ, అతను చాలా మంచి తుది ఉత్పత్తిని అందించగలిగాడు.

పాజిటివ్:

- నిర్మాత మరియు హీరోగా మంచు విష్ణు ప్రయత్నాలు
- ప్రభాస్ యొక్క అద్భుతమైన పాత్ర
-మోహన్‌లాల్ - మోహన్‌బాబు కనిపించారు
- క్లైమాక్స్ - ప్రీ క్లైమాక్స్
- భక్తి పాటలు

నెగటివ్:

- ఫిల్లర్ ఫస్ట్ హాఫ్
-రచనలో లోతు లేకపోవడం
-పేలవమైన సంభాషణలు

తీర్పు:

కన్నప్ప మొదటి సగం బలహీనంగా ఉంది కానీ రెండవ భాగంలో హృదయాన్ని కదిలించే క్లైమాక్స్‌తో పుంజుకుంటుంది. ప్రభాస్ మరియు మోహన్‌లాల్ వారి పరిమిత పాత్రలలో కూల్ మరియు స్వరపరచిన ముద్రను వదిలివేస్తారు. స్టార్-స్టడ్డ్ తారాగణం మరియు చిత్రం వెనుక ఉన్న కృషిని బట్టి, మీరు పెద్ద తెరపై ప్రయత్నించవచ్చు.

రేటింగ్: 2.5/5

---

## రానానాయుడు 2 ఎలా ఉంది..? ఫస్ట్ సీజన్తో పోలిస్తే ఏం మారింది?

వెబ్సిరీస్: రానా నాయుడు 2బీ నటీనటులు: వెంకటేశ్, రానా, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, అర్జున్ రాంపాల్, కృతి కర్బంద, సుర్వీన్ చావ్లా, సుచిత్ర పిళ్లై తదితరులుబీ కథ: అనన్య మోదీబీ దర్శకత్వం: సుపర్ణ్ వర్మ, కరణ్ అన్షుమన్బీ స్ట్రీమింగ్ వేదిక:

'రానా నాయుడు'.. ఈ వెబ్సిరీస్ గురించి ఓటీటీ ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. వెంకటేశ్ ,రానా కీలక పాత్రల్లో నటించిన ఈ సిరీస్ ఒకవైపు వినోదాన్ని పంచుతూనే మరోవైపు బోల్డ్ కంటెంట్ విషయంలో విమర్శలు ఎదుర్కొంది. దానికి కొనసాగింపుగా సీజన్-2 స్ట్రీమింగ్కు వచ్చింది. మరి దీని కథేంటి?ఎలాంటి థ్రిల్ను పంచింది?

కథేంటంటే..సెలబ్రిటీలకు ఏ సమస్య వచ్చినా పరిష్కార మార్గం చూపటంతో పాటు, అవసరమైతే తానే స్వయంగా రంగంలోకి దిగే వ్యక్తి రానా నాయుడు (రానా). శక్తియుక్తులు కలిగిన అతడిని తమ చెప్పు చేతల్లో ఉంచుకునేందుకు పలువురు ప్రయత్నిస్తుంటారు. ఇందులో భాగంగానే రానా కొడుకు అనీనాయుడు (మాధవ్ థింగ్రా)ను కిడ్నాప్ చేస్తారు. అతడిని కనిపెట్టడానికి విరాజ్ ఒబెరాయ్ (రజత్ కపూర్) రానాకు సాయం చేస్తాడు. ప్రతిగా తన దగ్గర మాత్రమే పనిచేయాలని షరతు విధిస్తాడు. తన కొడుకుని కిడ్నాప్ చేసిన వారిని రానా నాయుడు చంపేస్తాడు. వాళ్లలో రవూఫ్ మీర్జా (అర్జున్ రాంపాల్) సోదరుడు కూడా ఉంటాడు. తన సోదరుడి చావుకు కారణమైన రానాపై పగ తీర్చుకోవడంతో పాటు, రాజకీయంగానూ ఎదగాలని రవూఫ్ నిర్ణయించుకుంటాడు. మరి జైలులో ఉన్న రవూఫ్ ఎలా బయటకు వచ్చాడు? రానా కుటుంబమే లక్ష్యంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నాడు. ఈ విషయం తెలిసిన నాగా నాయుడు (వెంకటేశ్) ఏం చేశాడు? రానాకు క్లయింట్ అయిన విరాజ్ ఒబెరాయ్ (రజత్ కపూర్) చేసిన కుట్ర ఏంటి? చివరకు రానా, నాగా నాయుడు ఇద్దరూ కలిసి తమ కుటుంబాన్ని ఎలా కాపాడుకున్నారు? ఈ పోరాటంలో ఎవరిని కోల్పోయారు? అన్నది సిరీస్.

ఎలా ఉందంటే..ఈ సిరీస్కు రానా గుండెలాంటివారు. రానా నాయుడిగా ఆయన నటన చాలా సెటిల్డ్గా ఉంటుంది. కుటుంబం కోసం ఎంతవరకైనా వెళ్లే వ్యక్తిగా ఓవైపు భావోద్వేగాలను పంచుతూనే మరోవైపు యాక్షన్తోనూ అదరగొట్టారు. ఇక అతడి తండ్రి నాగా నాయుడిగా వెంకటేశ్కు ఈసారి స్క్రీన్ స్పేస్ తగ్గింది. తొలి సీజన్లో వచ్చిన విమర్శల కారణంగా ఆ పాత్రకు కత్తెర వేశారేమో అనిపిస్తుంది. అయినా, ఆయన కనిపించినంతసేపు ఓ జోష్ ఉంటుంది. ప్రతినాయకుడిగా అర్జున్ రాంపాల్ అలరించారు. ఆ పాత్ర తాలూకా ప్రభావం తెరపై కనిపిస్తుంది. సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, సుర్వీన్ చావ్లా, రజత్ కపూర్, కృతి కర్బంద తమ పాత్రలకు న్యాయం చేశారు. సాంకేతికంగా సిరీస్ బాగుంది. నిడివి విషయంలో ఇంకాస్త జాగ్రత్త తీసుకుని ఉంటే బాగుండేది. మొత్తం 8 ఎపిసోడ్స్ ఒక్కొక్కటీ సుమారు 40 నుంచి 50 నిమిషాల నిడివితో సాగుతాయి. తొలి సీజన్పై వచ్చిన విమర్శలను దృష్టిలో పెట్టుకుని కంటెంట్ విషయంలో దర్శకులు సుపర్ణ్ వర్మ, కరణ్ అంశుమన్ ఈసారి చాలా జాగ్రత్తలు తీసుకున్నారనిపిస్తుంది. ఈ సీజన్లో కొత్త పాత్రలను పరిచయం చేసినా, కథలో భాగంగా వాటిని మిళితం చేసిన విధానం బాగుంది.కుటుంబంతో కలిసి చూడొచ్చా: కొంచెం ఇబ్బందికరమే. సీజన్-1తో పోలిస్తే, బోల్డ్ కంటెంట్ విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకున్నా, సగటు వెబ్సిరీస్లో వినిపించే అసభ్య పదజాలాన్ని మాత్రం చాలా చోట్ల వదిలేశారు.

-బలాలు :- రానా, వెంకటేశ్ ఇతర నటీనటులు
- దర్శకత్వం,- స్క్రీన్ప్లే,బలహీనతలు
- నిడివి
- బలమైన కథ లేకపోవటం




చివరిగా: 'రానా నాయుడు2' ఎంగేజింగ్ అండ్ ఎంటర్టైనింగ్.

గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే! డ్రామాగా సిరీస్ను తీర్చిదిద్దారు. మూడు వైపుల నుంచి కథ సాగుతున్నా, మధ్యలో నాగా నాయుడు, తేజ్ నాయుడు, జఫ్ఫా నాయుడుల సబ్ప్లాట్స్ నడుస్తున్నా అన్నింటికీ రానా పాత్రను సెంటరాఫ్ అట్రాక్షన్ తీసుకుని దాన్ని అన్నింటికీ అన్వయిస్తూ తీర్చిదిద్దిన విధానం బాగుంది.



సూర్య
29.6.2025

## 29. 6.2025 నుంచి 5.7.2025 వరకు

# ద్వాదశరాశి ఫలములు (వార ఫలాలు)

### మేషరాశి

అశ్విని 1,2,3,4 పాదములు - భరణి 1,2,3,4 పాదములు
కృతిక 1వ పాదము

వారం ప్రారంభంలో సంతానమునకు అభివృద్ధి, ఆర్థిక విషయాల కోసం ఎక్కువ ఆలోచనలు చేస్తారు. రుణాలు చెల్లిస్తారు, ఆరోగ్యం అనుకూలంగా ఉ ంటుంది, శత్రువుల మీద విజయం సాధిస్తారు. కోర్టు వ్యవహారాలు, ఆర్థిక విషయాలు, పోటీలు అనుకూలం, వృత్తిని పుణ్యాలను పెంచుకుంటారు. తగిన గుర్తింపు గౌరవం. మైత్రి బంధాలు బలపడతాయి. వృత్తి సంబంధమైన విషయాలలో అధిక శ్రమతో ముందుకు వెళతారు. నూతన వృత్తులకు ప్రయత్నం చేసే వారికి మంచి అవకాశాలు. గౌరవం బాధ్యతలు పెరుగుతాయి. ఉన్నత స్థాయి వ్యక్తులతో మాటామంతి. ఆలోచనలు ఫలిస్తాయి, కంటి ఆరోగ్యం లో శ్రద్ధ తీసుకోవాలి, ఆహార నియమాలు పాటించాలి, ఆకస్మిక: విమర్శలకు, సోదర వర్గంతో విభేదాలకు దూరంగా ఉండాలి. ప్రయాణాలకు అవకాశం, మరిన్ని మంచి ఫలితాలు కొరకు విష్ణు సహస్రనామ పారాయణ మంచిది.

### వృషభరాశి

కృతిక 2,3,4 పాదములు - రోహిణి 1,2,3,4 పాదములు
మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలో ఫలితా అంశాలు గమనించగా పెద్దల ఆరోగ్యశ్రద్ధ తీసుకుంటారు, ఉన్నత స్థాయి వ్యక్తులతో విభేదాలకు దూరంగా ఉండాలి. గృహ వాతావరణం అసౌకర్యంగా ఉంటుంది, ప్రశాంతత తక్కువ, విద్యార్థులు విద్య మీద దృష్టిని కేటాయించాలి. గృహ వాహన రిపేర్ల కొరకు శ్రద్ధ. స్త్రీ సంతానం అభివృద్ధి. పురుష సంతానం మీద ,అభివృద్ధి కొరకు ప్రత్యేక దృష్టిని కేటాయించాలి. మానసిక ప్రశాంతత కొంత తక్కువగా ఉ ంటుంది. గవర్నమెంట్ పనులలో ఉన్నత స్థాయి అధికారులు రాజకీయ నాయకుల సహకారాన్ని కోరుకుంటారు. ఉన్నత విద్య కొరకు విదేశీయానానికి శ్రమ చేస్తారు. వృత్తిపరమైన విషయాల అభివృద్ధి, నూతనపరిచయాలు,వ్యాపారం విస్తరణ, వీలైనంతవరకు స్త్రీలతో అభిప్రాయ బేధాలకు దూరంగా ఉండాలి. మరిన్ని మంచి ఫలితాల కొరకు శివాలయ సందర్శన మంచిది.

### మిధునరాశి

మృగశిర 3,4 పాదములు - ఆరుద్ర 1,2,3,4 పాదములు
పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో ఫలితాంశములను గమనించగా వ్యక్తిగత ఆరోగ్య విషయంలో, అధిక ఖర్చులు, వృత్తిపరమైన చికాకులు,ముఖ్యముగా కుటుంబ వ్యవహారాలు ఊహించని ఇబ్బందులను పెంచుతాయి. తలనొప్పి, కంటికి సంబంధించిన అనారోగ్యాలు, నిర్లక్ష్యం చేయరాదు. దగ్గర ప్రయాణాలకు అవకాశం, ముఖ్య వ్యవహారాలలో శక్తి సామర్థ్యాలను పెంచుకుంటూ ముందుకు వెళ్ళడానికి కృషి చేస్తారు.వారం మధ్యలో డ్రైవింగ్ చేసేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి, వాహనమునకు సంబంధించిన ఇబ్బందులు, అధికం. వృత్తిపరమైన విషయాలలో ముఖ్యంగా సమయాలు అనవసర గందరగోళం. ఆరోగ్య, వాహన విషయాలు జాగ్రత్త.జ్ఞాపక శక్తి తగ్గుతుంది, వృత్తిపరంగా అనవసర వ్యక్తుల జోక్యం చికాకును సృష్టిస్తుంది. మరిన్ని మంచి ఫలితాలు సత్యనారాయణ స్వామి ఆరాధన మంచిది.

### కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము - పుష్యమి 1,2,3,4 పాదములు
ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో ఫలితాంశములను గమనించగా జీవిత భాగస్వామితో, కుటుంబములోని సభ్యులతో అనవసర వాదనలకు దూరంగా ఉండాలి, ఆర్థిక విషయాలలో ఆటంకాలు, వాగ్దానాలు నిలుపుకోవడంలో ఇబ్బందులు, అనవసర ఖర్చులు కుటుంబ వ్యవహారాల్లో చికాకులను పెంచుతాయి. వ్యాపార వ్యవహారములలో, స్నేహ సంబంధాలలో తగిన జాగ్రత్తలు అవసరం. వారం మధ్యలో పౌరుషం పెరుగుతుంది నాయకత్వ లక్షణాల శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి. వ్యక్తుల సహకారాన్ని పొందుతారు. నూతన గృహ వాహనములకు, రుణముల కొరకు ప్రయత్నాలుచేస్తారు. వారాంతంలో కుటుంబ స్త్రీల సహకారాన్ని పొందుతారు. విందు వినోదాల్లో పాల్గొంటారు, పూర్వ రుణములు చెల్లిస్తారు. మానసిక ప్రశాంతత తనే పెంచుకోవాలి. మంచి ఫలితాల కొరకు దత్తాత్రేయుని ఆరాధన మంచిది.

### సింహరాశి

మఖ 1,2,3,4 పాదములు - పుబ్బ 1,2,3,4 పాదములు
ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలో ఫలితాంశములను గమనించగా, ఆరోగ్య విషయంలో ఖర్చులు. విద్యార్థులకు పోటీ తత్వం పెరుగుతుంది, రుణములు చెల్లిస్తారు, రోగ నిరోధక శక్తి పెరుగుతుంది, అనవసర ఖర్చులను కొంతమేర నియంత్రించుకోగలుగుతారు. రహస్య శత్రువుల విషయంలో జాగ్రత్తలు అవసరం, వారం మధ్యలో కుటుంబ వ్యవహారాలలో, ఆర్థిక విషయాలలో అనవసర వ్యక్తుల ప్రమేయాన్ని అధిగమించడానికి ప్రయత్నం చేస్తారు. భాగస్వామి కుటుంబ సభ్యులతో అభిప్రాయ బేధాలుకు దూరంగా ఉండాలి. దీర్ఘకాలిక అనారోగ్యాలను అధిగమించాలి అన్న విధానాల్లో శ్రద్ధ తీసుకుంటారు. వారం చివరిలో ధైర్యంగా సాహసంగా ముందుకు పెడతారు, నూతన వాహన కొనుగోలు కొరకు, భాగస్వామికి బహుమానాల కొరకు వెచ్చిస్తారు. మరిన్ని మంచి ఫలితాల కొరకు విష్ణు సహస్రనామ పారాయణ మంచిది.

### కన్యారాశి

ఉత్తర 2,3,4 పాదములు - హస్త 1,2,3,4 పాదములు
చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలో ఫలితములు గమనించగా మానసిక ప్రశాంతత తక్కువగా ఉంటుంది. ఆర్థిక ఖర్చులు నియంత్రించుకోవడానికి ప్రయత్నం చేస్తారు, వృత్తిపరమైన ప్రయాణములు. జీవిత భాగస్వామి తోను వారి యొక్క బంధువులతో మాట్లాడేటప్పుడు, పౌరుషం నాయకత్వ లక్షణాలు ఆదిపత్య ధోరణిని విడనాడాలి. చిన్న చిన్న విషయాలకి కలహములు, అపార్థములు ఏర్పడే అవకాశం ఉన్న రిత్య జాగ్రత్తలు అవసరం. ప్రయాణములు చేయునప్పుడు, ముఖ్యంగా డ్రైవింగ్ సందర్భాలలో విష్ణు: గరుడ వాహన అనే శ్లోకాన్ని పట్టించడం మేలు. వారం చివరిలోవాతావరణం అనుకూలంగా ఉంటుంది, ముఖ్యంగా తోబుట్టులతో, భాగస్వామితో అనవసర అపార్థములు తగ్గుతాయి. సామర్థ్యం పెరుగుతుంది, షాపింగులు, విందు వినోదాల్లో పాల్గొంటారు. మంచి ఫలితాల కొరకు లలితా దేవి శ్లోకాలు అష్టోత్తరాలు, లలితా సహస్రనామం మేలు.

### తులారాశి

చిత్త 3,4 పాదములు - స్వాతి 1,2,3,4 పాదములు
విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో ఫలితాంశములను గమనించగా లాభ చంద్రసంచారము చే సంతానముతో అనుబంధము అనుకూలత, సృజనాత్మకత పెరుగుతుంది పెరుగుతుంది, ఎదురుచూస్తున్న వర్తమానాలు దూర ప్రదేశాల నుంచి అందుకుంటారు. ఒక వార్త ఆసక్తిని రేకెత్తిస్తుంది.సంతానం నుంచి బహుమతులు అందుకుంటారు, షాపింగులు విందు వినోదాలు, మంచి ఖర్చులు ఆనందాన్ని ఇస్తాయి. గృహ వాహన, తల్లి ఆరోగ్యం, వ్యవసాయ సంబంధం అంశాలు కొంత అసౌకర్యం,మానసిక ప్రశాంతత తక్కువగా ఉంటుంది. ఆరోగ్యం మీద శ్రద్ధ తీసుకోవాలి. విద్యార్థులు విద్య మీద దృష్టి అవసరం. ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యము తగదు, వారం చివరిలో మాటలతోపనులుసాధించుకుంటారు, ఆర్థిక విషయాలు అనుకూలంగా ఉంటాయి. మరిన్ని మంచి ఫలితాల కొరకు ఆదిత్య హృదయ పారాయణ మంచిది.

### వృశ్చిక రాశి

విశాఖ 4వ పాదము - అనురాధ 1,2,3,4 పాదములు
జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో వృత్తిపరమైన విషయాల మీద ఎక్కువ శ్రద్ధ తీసుకుంటారు. గృహ వాతావరణం, వాహన సంబంధ విషయాలు కొంత అసౌకర్యంగా ఉంటుంది.నూతన వాహనాలు, గృహములు సంబంధించినఅంశముల మీద విస్తృతంగాదృష్టి సారిస్తారు. రవి ప్రభావం ఖర్చులు పెరుగుతాయి, ఉన్నత స్థాయి వ్యక్తులతో ముఖ్యంగా గవర్నమెంట్ సంబంధించిన పనులలో సామాన్య ఫలితాలు. ఉన్నత విద్య కొరకు విదేశీ ప్రయాణాలకి కొంత అవకాశములు. ఆర్థిక సంబంధమైన విషయాలు అనుకూలంగా ఉంటాయి, ముఖ్యంగా విదేశాలలో ఉండే తోబుట్టువులు, స్నేహితులు సహకారం కూడా అందుకుంటారు. వారం చివర్లో విద్యార్థులకు విద్యాసంబంధమైన విషయం మీద దృష్టి సారించాలి. మంచి ఫలితాల కొరకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆరాధన మంచిది.

### ధనస్సు రాశి

మూలా 1,2,3,4 పాదములు -
పూర్వాషాడ 1,2,3,4 పాదములు - ఉత్తరాషాడ 1వ పాదము

వారం ప్రారంభంలో వృత్తికి సంబంధించిన విషయాలలో ప్రయాణాలకు అవకాశం.బాధ్యతలు పెరుగుతాయి. మాటలు విషయంలో.కుటుంబవ్యవహారాలలో, గృహవాతావరణంలో కుటుంబ సభ్యులతో,ఆర్థిక అంశాలలో తగిన విధంగా ఆచితూచి వ్యవహరించాలి. సహకార లబ్ధి, ఆశించిన ఫలితాలు పొందుతారు ఆర్థిక విషయాలు అనుకూలం, ఎంతగానో ఎదురు చూస్తున్న విషయాలలో దూర ప్రదేశము నుంచి ఆసక్తికరమైన సమాచారాన్ని అందుకుంటారు. ముఖ్యంగా శ్రమ అధికంగా ఉంటుంది, ఒత్తిడి, బంధు వర్గంతో విభేదాలకు దూరంగా ఉండాలి. అలవాట్లకి కూడ దూరం మంచిది.ఆకస్మిక చికాకులు ఇబ్బంది పెట్టే విధానం. అనవసరమైన ఖర్చు. కుటుంబ సభ్యుల యొక్క ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకుంటారు. అనవసర విమర్శలకు దూరంగా ఉండాలి.మరిన్ని మంచి ఫలితములు కొరకుగణేష్ ఆరాధన, దేవాలయ సందర్శన.

### మకరరాశి

ఉత్తరాషాడ 2,3,4 పాదములు - శ్రవణం 1,2,3,4 పాదములు
ధనిష్ఠ 1,2 పాదములు

వారం ప్రారంభంలో ముఖ్యమైన విషయాలలో ఆలస్యాలు ఆటంకాలు, ఆరోగ్య విషయంలో శ్రద్ధ, ప్రయాణాలలో చికాకులు, అనవసరమైన వ్యయాలు, ఆశించినఅంశాలలో చాలా శ్రమ ఫలితాలు ఇస్తాయి. దూరప్రదేశాల నుంచి సమాచారాలు కొంత అందుతుంది. వృత్తికి సంబంధించిన విషయాలలో, భాగస్వామ్య వ్యవహారాలలో ఉన్నత స్థాయి వ్యక్తుల యొక్క సహకారాన్ని ఆశిస్తారు. వారం మధ్యలో దూర ప్రయాణానికి, ఉన్నత విద్య కొరకు ప్రయత్నం చేసే వారికి విదేశీ అవకాశాములు. ఇతరుల సహకారాన్ని తీసుకునేటప్పుడు వైరాగ్య ధోరణిని వదిలేయాలి. తోబుట్టువులు తో వైరికి దూరంగా ఉండాలి. వ్యాపార విస్తరణ కోసం ఆలోచనలు చేస్తారు, శ్రమ అధికం. వారం చివరిలో ఆర్థికపరమైన విషయాలు అనుకూలంగా ఉంటాయి. మరిన్ని మంచి ఫలితాల కొరకు లలితా దేవిని ప్రార్థించట మేలు.

### కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు - శతభిషం 1,2,3,4 పాదములు
పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో ఆర్థిక సంబంధమైన విషయాలలో వాగ్వాదాలలో, అనవసరమైన ఖర్చులకి దూరంగా ఉండాలి, ప్రయాణాలలో జాగ్రత్తలు అవసరం, ఆరోగ్యముతగినశ్రద్ధ తీసుకోవాలి. చాలాకాలంగా ఎదురుచూస్తున్న ఆర్థిక విషయాలు,మైత్రి బంధాలు సామాన్యం. వైరాగ్యాన్ని అధిగమించాలి. వృత్తిపరమైన విషయాల్లో తగిన శ్రద్ధ తీసుకొని ముందుకు వెళ్లాలి. ఆధ్యాత్మిక పెరుగుతుంది, దైవచింతన సంకల్పబలంతో నుకున్నదిసాధిస్తారు.విదేశీ వ్యవహారాలకు సంబంధించిన విషయాలలో ధన రాబడి, తండ్రి ఆరోగ్యం, ఆకస్మిక విషయాలు, విదేశీ వ్యవహారాలు, ఉన్నత విద్య, వ్యాపార వ్యవహారాలుకొంతఆందోళనను, అశాంతిని కలిగిస్తాయి. నిరాసానిస్పృహాలనుఅధిగమించాలి,మానసిక ప్రశాంతతను పెంపొందించుకునేందుకు యోగా మెడిటేషన్ చేయాలి. మరిన్ని మంచి ఫలితాలు కొరకు దుర్గా దేవి ఆరాధన.


### మీన రాశి

పూర్వాభాద్ర 4వ పాదము -
ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు - రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో ఆశించిన పనులలో విజయం, ఆర్థిక లాభం, ఆగుతూ వస్తున్న అనేకమైన పనులు ముందుకు వెళతాయి. సంఘంలో గుర్తింపు గౌరవం, మిత్రుల సహకారం, పేరు ప్రఖ్యాతలు పెరుగుతాయి. రోగ నిరోధక శక్తి, శత్రు రోగ రుణాల మీద విజయాన్ని సాధిస్తారు. ఉన్నత స్థాయి వ్యక్తులతో ఆశించిన పనుల జరగడానికి సూచనలు. అనవసరమైన ఖర్చులు నియంత్రించుకో గలుగుతారు. ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతారు. మీ మీద మీకు నమ్మకం, స్థిరమైన అభిప్రాయాలు. మధ్యలో వ్యాపార విస్తరణ స్నేహ సంబంధాలు బలపడతాయి, నూతన పరిచయాలు విందు వినోదాలు, భాగస్వామ్య వ్యవహారాలలో పెట్టుబడులకి ఆలోచనలు, జీవిత భాగస్వామితో నూతన ప్రదేశాలకి వెళ్ళడానికి అవకాశాలు. మరిన్ని మంచి ఫలితములు కొరకు సూర్యనారాయణస్వామి ఆరాధన మంచి.,

నిర్వాహణ : స్వర్ణ కంకణ సన్మానిత, జ్యోతిష చూడామణి, జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద

**డా. ఈడ్పుగంటి పద్మజారాణి**



9849252852 - 7506976164 - padma.suryapaper@gmail.com

సూర్య
www.suryaa.com
29.6.2025





కీర్తి సురేష్